# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 35 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 22-08-2026 | పేజీలు: 10


దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం
(10 గ్రాములు)
1,47,100/-
(22 క్యారెట్స్)
1,54,460/-
(24 క్యారెట్స్)

## సిరా చుక్క

ఎవరిది బాధ్యత?
అడిగిందల్లా చేతికిస్తూ
అప్పుల ఊబిలో మునుగుతూ
కష్టం విలువ దాచేస్తే
పసి మనసులు నిలబడేదెలా?
తప్పుల బాటను కప్పిపుచ్చి
బంధాల వెనుక దాచేస్తూ
తండ్రికి నిజం చెప్పకపోతే
రేపటి తరం మారేదెలా?
చెప్పే పాఠంపై నమ్మకమే లేక
తమ పిల్లలను వేరే చోట చేర్చి
అక్షరాన్ని వ్యాపారం చేస్తే
సంస్కారం అలవడేదెలా?
ఫీజుల బకాయిల నెపంతో
సర్టిఫికేట్లను బంధిస్తూ
భవిష్యత్తును తాకట్టు పెడితే
యాజమాన్యాలకు జాలి దక్కేదెలా?
పక్కింటి అరుపులు వినపడినా
తలుపులు బిగించే స్వార్థంలో
నడిరోడ్డున ప్రాణం పోతున్నా
కంటిపాపను మూసే నిశ్శబ్దంలో,
సమాజం రోగగ్రస్థమైతే
మానవత్వం బతికేదెలా?
పాశ్చాత్య భాషా మోజులో పడి
మన సున్నిత మనసును చంపేసి
యాంత్రికంగా మారిపోతే
భారతీయత వర్ధిల్లేదెలా?
మనం నాటిన విత్తనమే చెట్టవుతుంది
మనం చూపే మార్గమే రేపటి దారవుతుంది,
ముందు మనం పద్ధతిగా ఉంటేనే
తరాలు సన్మార్గంలో నడుస్తాయి

– రాగిపని బ్రహ్మచారి నల్గొండ..,

# ఉమ్మడి వరంగల్‌లో సామాజిక న్యాయం ఎక్కడ

- గెలిచిన ఏకైక బీసీ ఎమ్మెల్యే కొండా సురేఖే
- కొండా ఫ్యామిలీపైనే ఎందుకు రాజకీయ కుట్రలు
- 12 నియోజకవర్గాల్లో 2 ఎస్సీ, 3 ఎస్టీ.. మిగిలిన 7 జనరల్ స్థానాల్లో బీసీలకు ఒక్క సీటే.
- ఐదు రెడ్లు, ఒక వెలమ.. ఒక్క బీసీ ప్రాతినిధ్యం
- ఇదేనా సామాజిక సమతుల్యత
- కేసీఆర్ హయాంలో బీసీ నాయకత్వానికి పెద్దపీట
- కాంగ్రెస్‌లో రెడ్ల ఆధిపత్యం పెరిగిందన్న విమర్శలు
- రెడ్లకు ఒక న్యాయం.. బీసీలకు మరో న్యాయమా
- కొండా వ్యవహారంతో ఉమ్మడి జిల్లాలో ముదురుతున్న చర్చ







**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం**. ఉమ్మడి వరంగల్ జిల్లా అంటే ఉద్యమాలకు నిలయం.. తెలంగాణ ఉద్యమంలో ముందువరుసలో నిలిచిన రాజకీయ గడ్డ. అలాంటి ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు మరో కీలక చర్చ మొదలైంది. "సామాజిక న్యాయం ఎక్కడ?" అన్న ప్రశ్న బీసీ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా రాజకీయ ప్రాతినిధ్యం, టికెట్ల కేటాయింపు, అధికార పదవుల్లో సామాజిక సమతుల్యతపై బీసీ సంఘాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి.ఈ చర్చకు కేంద్ర బిందువుగా మారింది మంత్రి కొండా సురేఖ, కొండా కుటుంబం చుట్టూ జరుగుతున్న రాజకీయ పరిణామాలు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనరల్ నియోజకవర్గాల నుంచి గెలిచిన ఏకైక బీసీ ఎమ్మెల్యే, ఏకైక బీసీ మహిళా నాయకురాలిగా కొండా సురేఖ ఉన్నప్పటికీ, గెలిచినప్పటి నుంచి, ముఖ్యంగా మంత్రి పదవి వచ్చిన తర్వాత ఆమె కుటుంబం చుట్టూ వరుస వివాదాలు, రాజకీయ ఒత్తిళ్లు ఎందుకు పెరుగుతున్నాయన్న ప్రశ్న బీసీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇటీవలి నెలల్లో కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య విభేదాలు కూడా బహిరంగ చర్చకు రావడంతో ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి.12 నియోజకవర్గాలు.. బీసీలకు ప్రాతినిధ్యం ఎంత?ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో రెండు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలు, మూడు ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట ఎస్సీ స్థానాలు కాగా, మహబూబాబాద్, డోర్నకల్, ములుగు ఎస్టీ స్థానాలు.ఈ ఐదు రిజర్వుడ్ స్థానాలను పక్కన పెడితే మిగిలేది ఏడు జనరల్ నియోజకవర్గాలు. అసలు సామాజిక న్యాయం ప్రశ్న ఇక్కడే మొదలవుతోందని బీసీ వర్గాలు అంటున్నాయి.ఈ ఏడు జనరల్ స్థానాల్లో రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిశీలిస్తే అధికభాగం అగ్రవర్ణ సామాజిక వర్గాల చేతుల్లోనే ఉందన్నది వారి వాదన. ఐదు స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు, ఒక స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన నేత ఉండగా, ఒక్క కొండా సురేఖ మాత్రమే పద్మశాలి బీసీ వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.జనాభాలో బీసీలు పెద్ద సంఖ్యలో ఉన్నా, రాజకీయ ప్రాతినిధ్యంలో మాత్రం వారి వాటా ఇంత పరిమితంగా ఉండటం సామాజిక న్యాయం ఎలా అవుతుందని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

**కేసీఆర్ హయాంలో బీసీ నాయకత్వానికి పెద్దపీట.**

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీ నాయకత్వాన్ని పెంచేందుకు అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని బీసీ నాయకులు గుర్తుచేస్తున్నారు.మధుసూదనాచారికి స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం, నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్ భాస్కర్ వంటి బీసీ నాయకులను ఎమ్మెల్యేలుగా తీర్చిదిద్దడం, గుండు సుధారాణికి మేయర్ పదవి దక్కడం, బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు రాజ్యసభ సభ్యత్వంతో పాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం రావడం వంటి ఉదాహరణలను

మిగతా 2లో

# హోమ్ మినిస్టర్ కాదు.. సీఎం కావాలి

- అనుభవంతో తెలంగాణలో మార్పు తేవాలి
- సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడికి మరింత పెద్ద బాధ్యతలు ఇవ్వాలన్న అభిప్రాయం
- పదవుల కోసం కాదు.. రాష్ట్ర దిశ మార్చే అవకాశం కోసం సీఎం పదవి కావాలంటున్న చర్చ
- ప్రజా సమస్యలపై అవగాహన.. పరిపాలనపై పట్టు
- రాజకీయ అనుభవమే ఆయన బలం
- కేవలం హోమ్ శాఖకే పరిమితం చేస్తే అనుభవం పూర్తిస్థాయిలో ఉపయోగపడదన్న వాదన
- ఒక్కసారి ముఖ్యమంత్రి అయితే తెలంగాణలో ఏదో ఒక మంచి మార్పు తప్పక కనిపిస్తుందన్న విశ్వాసం



**ప్రజలు వాయిస్, ప్రత్యేక కథనం**.తెలంగాణ రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకులను కేవలం ఒక శాఖకు పరిమితం చేయడం కంటే, వారి అనుభవాన్ని రాష్ట్ర పరిపాలన మొత్తానికి ఉపయోగించుకోవాలన్న చర్చ వినిపిస్తోంది. ఈ కోణంలోనే హోమ్ మినిస్టర్ కాదు.. సీఎం కావాలి అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హోమ్ శాఖ అనేది రాష్ట్రంలో అత్యంత కీలకమైన శాఖల్లో ఒకటే అయినప్పటికీ, రాజకీయంగా సుదీర్ఘ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన, ప్రభుత్వ వ్యవస్థలపై పట్టు ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి స్థాయిలో బాధ్యతలు చేపడితే రాష్ట్రానికి మరింత ఉపయోగపడతారన్నది ఈ వాదన సారాంశం.

**అనుభవమే అసలు అర్హత..**

రాజకీయాల్లో పదవులు రావడం ఒక ఎత్తయితే.. ఆ పదవులను ప్రజల ప్రయోజనాల కోసం ఎలా వినియోగించుకోవాలో తెలిసిన అనుభవం మరో ఎత్తు

మిగతా 2లో

# పార్టీ ఫిరాయింపులపై 'క్లైమాక్స్'

- సెప్టెంబర్ 16న హైకోర్టు తీర్పు
- ఎమ్మెల్యేల భవితవ్యంపై ఉత్కంఠ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ముగిసిన వాదనలు
- స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేసిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు
- 'పార్టీ మారలేదు.. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం' అన్న ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు
- ఎన్నికల గెజిట్లు.. అఫిడవిట్లు.. వీడియోలు.. మీడియా కథనాలను కోర్టు ముందుంచిన పిటిషనర్లు

2లో




# రాయదుర్గం భూమికి భలే డిమాండ్

- ఎకరం రూ.264 కోట్లు.. దేశంలోనే సరికొత్త రికార్డు
- టీజీఐఐసీ ఈ-వేలంలో 5.25 ఎకరాలు రూ.1,386 కోట్లకు విక్రయం
- మేలో ఎకరం రూ.237 కోట్లు
- జూన్‌లో రూ.204 కోట్లు
- 2025లో రూ.177 కోట్లు
- నెలల వ్యవధిలోనే ధరలకు రెక్కలు
- ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం
- ఐటీ కారిడార్‌లో భూములకు భారీ డిమాండ్



**ప్రజా వాయిస్,హైదరాబాద్:** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రాయదుర్గం భూముల వేలం మరోసారి దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ప్రభుత్వ భూమికి ఏకంగా ఎకరం రూ.264 కోట్లు పలకడం సంచలనంగా మారింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన తాజా ఈ-వేలంలో రాయదుర్గం సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల స్థలం రూ.1,386 కోట్లకు విక్రయమైంది. ఎకరా ధరలో ఇది సరికొత్త రికార్డుగా నిలిచింది.

**నెలల వ్యవధిలోనే మూడుసార్లు రికార్డు.!**

రాయదుర్గం భూముల ధరలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో వరుస వేలాలు స్పష్టం చేస్తున్నాయి. గత మేలో ఇదే సర్వే నంబర్‌లోని 6.29 ఎకరాలు ఎకరం రూ.237 కోట్లకు అమ్ముడయ్యాయి. అప్పటి వరకు ఇదే అత్యధిక ధరగా

మిగతా 2లో

# రైలు సమస్యలపై రాజీ లేదు

- ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా రైల్వే జీఎంతో ప్రత్యేక భేటీ
- మిర్యాలగూడలో ఇంటర్‌సిటీ హాల్ట్ కోసం మరోసారి బలమైన డిమాండ్
- దామరచర్ల స్టేషన్ పునఃప్రారంభం నుంచి అండర్‌బ్రిడ్జిల సమస్యల వరకు అధికారుల దృష్టికి
- స్టేషన్ అభివృద్ధి, డబ్లింగ్ పనులు, కొత్త రైల్వే మార్గాలపై ఎంపీ సమగ్ర చర్చ
- పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- ఎంపీ రఘువీర్ రెడ్డి.
- ఎంపీ వినతిపై సానుకూల స్పందన
- నల్గొండ ప్రయాణికుల్లో కొత్త ఆశలు

2లో

# అంతరిక్షంలో యువశక్తికి మోదీ భరోసా

- స్పేస్ రంగంలో యువ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు పూర్తి మద్దతు
- యువతే భారత అంతరిక్ష భవిష్యత్ బలం
- నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- ఏఐ శిక్షణ నుంచి పరిశోధన నిధుల వరకు యువతకు కేంద్రం ప్రాధాన్యం



**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష రంగంలో యువశక్తి కీలక పాత్ర పోషించబోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.అంతరిక్ష రంగానికి చెందిన యువ ఆవిష్కర్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, యువ శాస్త్రవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. సవాళ్లతో కూడిన స్పేస్ రంగంలోకి అడుగుపెట్టి వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్న యువతను అభినందించారు.

**యువ ఆవిష్కరణలకు ప్రశంసలు**

సమావేశంలో పలువురు యువ స్టార్టప్ ప్రతినిధులు తమ సాంకేతిక పరిశోధనలు, రూపొందించిన ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలను ప్రధానమంత్రికి వివరించారు. అంతరిక్ష పరిశోధనల్లో కొత్త ఆలోచనలకు యువత ప్రాధాన్యం ఇవ్వడం దేశానికి సానుకూల పరిణామమని మోదీ పేర్కొన్నారు. యువతలోని ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలను దేశ అంతరిక్ష సామర్థ్యంతో అనుసంధానించడం ద్వారా భారత్ మరింత ముందుకు వెళ్లగలదని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రైవేట్ రంగానికి అండ**

భారత అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం, స్టార్టప్‌ల భాగస్వామ్యం కూడా కీలకమని కేంద్రం స్పష్టం చేస్తోంది. దేశ భవిష్యత్ అంతరిక్ష సామర్థ్యాలను పెంచే ప్రయత్నాల్లో యువ స్టార్టప్‌లకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. అంతరిక్ష

మిగతా 2లో

# ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కలకలం

- ఆరు రెట్లు పెరిగిన కేసులు
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న బాధితుల తాకిడి
- ఈ ఏడాది ఇప్పటివరకు 1,349 కేసులు
- గతేడాది ఇదే సమయానికి 229 మాత్రమే
- మారుతున్న వాతావరణంతో హెచ్1ఎన్1తోపాటు ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు
- వైద్య సిబ్బందిలోనూ వైరస్ లక్షణాలు
- కొందరిలో పడిపోతున్న ఆక్సిజన్ స్థాయిలు
- తీవ్ర శ్వాసకోశ సమస్యలతో ఆస్పత్రులకు క్యూ
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

2లో

# అంతరిక్షంలో యువశక్తికి మోదీ భరోసా

**మొదటి పేజీ తరువాయి**

సాంకేతికతలో పెట్టుబడులు, పరిశోధనలు, కొత్త ఉత్పత్తుల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

**ఏఐపై యువతకు ప్రత్యేక దృష్టి**

అంతరిక్ష రంగంతో పాటు కృత్రిమ మేధస్సు (AI) వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లోనూ యువతను సిద్ధం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. దేశవ్యాప్తంగా కోటిమంది యువతకు AIలో ఉచిత శిక్షణ అందించాలనే లక్ష్యం యువతను భవిష్యత్ ఉద్యోగాలు, సాంకేతిక అవకాశాలకు సిద్ధం చేసే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

**పరిశోధనలకు భారీ నిధులు**

యువతలోని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రూ.1 లక్ష కోట్ల నిధి వంటి చర్యలకు కేంద్రం ప్రాధాన్యం ఇస్తోంది. పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలకు ఆర్థిక సహకారం అందించడం ద్వారా యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చుకునే అవకాశం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# రాయదుర్గం భూమికి భలే డిమాండ్

**మొదటి పేజీ తరువాయి**

నిలిచింది. ఆ రికార్డు ఎక్కువ కాలం నిలవక ముందే జూన్‌లో మరో 5.09 ఎకరాలు ఎకరం రూ.204 కోట్లకు విక్రయమయ్యాయి. ఇక 2025లో జరిగిన వేలంలో ఎకరం రూ.177 కోట్లు పలికింది. తాజాగా రూ.264 కోట్లకు చేరడంతో రాయదుర్గం భూముల ధరల దూకుడు మరోసారి చర్చనీయాంశమైంది.

**ఎందుకింత క్రేజ్.?**

రాయదుర్గం చుట్టూ ఇప్పటికే హైదరాబాద్ ఐటీ, వాణిజ్య రంగానికి చెందిన కీలక ప్రాంతాలు విస్తరించాయి. మైండ్‌స్పేస్, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లకు సమీపంలో ఉండటం ఈ ప్రాంతానికి ప్రధాన బలంగా మారింది. మరోవైపు కీలక వ్యాపార కారిడార్‌లో పెద్ద విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు పరిమితంగా అందుబాటులో ఉండటంతో వాటికి పోటీ పెరుగుతోంది. భవిష్యత్‌లో భారీ బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలకు అవకాశం ఉండటం కూడా కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది.

**ఖజానాకు భారీగా ఆదాయం**

రాయదుర్గం భూముల వేలంతో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. ఐటీ, వాణిజ్య సంస్థలకు అత్యంత అనుకూలమైన ప్రాంతం కావడంతో భవిష్యత్‌లో ఈ ప్రాంత భూములకు డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రూ.177 కోట్ల నుంచి రూ.264 కోట్లకు.. ఏడాది వ్యవధిలోనే ధరల దూకుడు హైదరాబాద్ భూముల మార్కెట్‌లో రాయదుర్గం ప్రత్యేకతను చాటుతోంది.

# రైలు సమస్యలపై రాజీ లేదు



**ప్రజ వాయిస్, సికింద్రాబాద్.** నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే అధికారుల వద్ద గట్టిగా వాదించారు. మిర్యాలగూడలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ నుంచి దామరచర్ల రైల్వే స్టేషన్ పునఃప్రారంభం, అండర్‌బ్రిడ్జిల వద్ద నీటి నిల్వలు, స్టేషన్ అభివృద్ధి, రైల్వే డబ్లింగ్, కొత్త రైల్వే మార్గాల వరకు నల్గొండ పార్లమెంట్ పరిధిలోని ప్రజల ప్రధాన డిమాండ్లను సికింద్రాబాద్‌లో జరిగిన సమావేశంలో రైల్వే జనరల్ మేనేజర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.మిర్యాలగూడలో 12795/12796 ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు క్రమం తప్పకుండా హాల్ట్ కల్పించాలని ఎంపీ రఘువీర్ రెడ్డి బలంగా డిమాండ్ చేశారు. చింతపల్లి ప్రాంతంలో రైల్వే ట్రాక్ కింద దెబ్బతిన్న ఎన్ఎస్‌పీ వజీరాబాద్ ఎల్2/ఎల్1 కాలువ పైప్‌లైన్ మరమ్మతుల అంశాన్ని కూడా ఎంపీ ప్రస్తావించారు. ఈ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. గుంటూరు–బీబీనగర్ మార్గంలో 239 కిలోమీటర్లు, మోటుమర్రి–విష్ణుపురం మార్గంలో 99.68 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులను 2028–29 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నల్గొండ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.17.01 కోట్లు, మిర్యాలగూడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.16.78 కోట్లు మంజూరై పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ పనుల్లో జాప్యం లేకుండా ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందేలా వేగవంతం చేయాలని ఎంపీ రఘువీర్ రెడ్డి కోరారు.కొత్త రైల్వే మార్గాలపైనా ఎంపీ ప్రత్యేక దృష్టి సారించారు. దోర్నకల్–మిర్యాలగూడ 97.45 కిలోమీటర్ల రైల్వే మార్గం రైల్వే బోర్డు పరిశీలనలో ఉండగా, కాచిగూడ–చిట్యాల–జగ్గయ్యపేట 228 కిలోమీటర్ల మార్గానికి డీపీఆర్ తయారీ దశలో ఉందని అధికారులు తెలిపారు. దోర్నకల్–గద్వాల్ 308.28 కిలోమీటర్ల మార్గానికి సంబంధించిన డీపీఆర్ రైల్వే బోర్డుకు సమర్పించబడిందని, ఔటర్ రింగ్ రైల్ ప్రాజెక్టు ఫేజ్–1 డీపీఆర్ కూడా పరిశీలనలో ఉందని వెల్లడించారు.రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారంలో జాప్యం సహించబోమని, నల్గొండ పార్లమెంట్ ప్రజలకు మెరుగైన రైల్వే సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎంపీ రఘువీర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి న్యాయమైన డిమాండ్‌ను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఎంపీ ప్రస్తావించిన సమస్యలపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించడంతో నల్గొండ పార్లమెంట్ పరిధిలోని ప్రజలు, నిత్య రైల్వే ప్రయాణికుల్లో సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయనే కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

# మంత్రి సేవలను తట్టుకోలేక మంత్రాలల్లుతున్నారు

- మహిళా మంత్రిపై మంటలు రాజేస్తున్నారు
- మంత్రి కొండ సురేఖ పై ఎందుకింత కక్ష
- ఎమ్మెల్యేగా పని చేయనోళ్లు పదవి దాహంతో పగబడుతున్నారు
- నియోజకవర్గ సేవలు మరిచి నిందలేసే పనిలోపడ్డారు
- ఎప్పుడు లేవని నోర్లు ఎగిసేగీసి పడుతున్నాయి

**ప్రజా వాయిస్ హైదరాబాద్/** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ,దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ మొక్కవోని విశ్వాసంతో ప్రజాసేవలో దూసుకుపోతున్న మహిళ నాయకురాలు ఓరుగల్లు పౌరుషాన్ని ప్రజాసేవలో అవలంబిస్తున్న సురేఖపై దినదినానికి కక్ష సాధింపు అభియోగాలు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రశంసలు విమర్శలు సర్వసాధారణమైనప్పటికీ మంత్రి సేవలను జీర్ణించుకోలేని కొంతమంది కుహన శక్తులు స్వయంగా రంగంలోకి దిగి మంత్రి పదవిని పోగొడతామంటూ కుట్రలు పన్నుతున్నారని వరంగల్ ప్రజలు చిదరించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు అనేది సర్వసాధారణమైనప్పటికీ మహిళా మంత్రిని టార్గెట్ చేయాల్సిన కఠినమైన పరిస్థితులు ఏ విధంగా కనబడుతున్నాయో కనరావడం లేదన్నారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన మంత్రి కొండ సురేఖ 2010లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన 30 కుటుంబాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థి ఉద్యమ నేతల విన్నపాలకు స్పందించి సొంత నిధులను ఉక్కంటి చొప్పున లక్ష ఇరవై వేల రూపాయలు పంచి ఉద్యమ రుణం తీర్చుకున్న సంఘటనలు వరంగల్ ప్రజలు కలకాలం గుర్తుకుంచుకున్నారు. మంత్రి కొండ సురేఖ పరువును ప్రతిష్ఠలను సంక్షేమ విలువలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో దిగజారుస్తున్న అసాంఘిక శక్తులను పసిగట్టి తక్షణం దూరం పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు. నాయకుల తీరు పట్ల అత్యంత విశ్వాసం కనబరుస్తున్న ప్రజలు కొంతమంది నాయకులు కనబరుస్తున్న పద్ధతిని జీర్ణించుకోలేకపోతున్న ఇబ్బందులు పడుతున్నారు.ప్రజా సేవలో పోటీపడి ప్రజల మన్ననలను పొందుకొని రాజకీయ జీవితాన్ని శాసించాలి. పనికి మాలిన రాజకీయాలతో ప్రజాగ్రహానికి గురికావద్దని ప్రజలు ప్రజాసేవకు కట్టుబడినప్పుడే ప్రజాభిశ్వాసాన్ని బలంగా కూడపెట్టుకోగలమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.రాజకీయం రాజకీయంలా చేయాలి గానీ మంత్రి పదవి పోగొట్టడం కోసం మంత్రాలల్లోద్దని ప్రజలు హితువు పలుకుతున్నారు. కక్షపూరిత చర్యలు విషపూరిత రాతలు చండాలమైన కామెంట్స్ లకు అతి త్వరలో కాలం సమాధానం చెప్పబోతుందని వరంగల్ ప్రజలు మంత్రి సురేఖపై బలమైన విశ్వాసాన్ని కనబరుస్తున్నారు.

# హోమ్ మినిస్టర్ కాదు.. సీఎం కావాలి

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు చూసి, అధికార–ప్రతిపక్ష రాజకీయాలను అనుభవించి, ప్రజా సమస్యలతో ప్రత్యక్షంగా మమేకమైన నాయకుడికి సీఎం బాధ్యతలు అప్పగిస్తే నిర్ణయాల్లో మరింత పరిణతి కనిపించే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాష్ట్ర స్థాయిలో పాలన అంటే కేవలం ఫైళ్లపై సంతకాలు చేయడం కాదు.. రైతు నుంచి ఉద్యోగి వరకు, యువత నుంచి మహిళల వరకు, గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరకు అన్ని వర్గాల సమస్యలను సమన్వయం చేయాల్సి ఉంటుంది.

**గతంలో హోమ్ శాఖకే పరిమితం ఎందుకు**

ప్రస్తుతం తెలంగాణలో హోమ్ శాఖతో పాటు శాంతిభద్రతల బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉంది. అధికారిక మంత్రివర్గ కేటాయింపుల ప్రకారం ఆయన వద్ద మున్సిపల్ పరిపాలన, సాధారణ పరిపాలన, లా అండ్ ఆర్డర్‌తో పాటు కేటాయించని ఇతర శాఖలు కూడా ఉన్నాయి.అయితే ఈ రాజకీయ అభిప్రాయంలో ప్రధానంగా వినిపిస్తున్నది ఒక్కటే ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కేవలం హోమ్ శాఖకే పరిమితం చేయడం కంటే, రాష్ట్రాన్ని నడిపించే స్థాయిలో అవకాశం ఇస్తే ఆయన అనుభవం మరింత విస్తృతంగా ఉపయోగపడుతుందా..అన్న ప్రశ్న. హోమ్ శాఖలో చట్టం,శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థ, జైళ్లు, అగ్నిమాపక సేవలు వంటి కీలక అంశాలు ఉంటాయి. కానీ సీఎం స్థాయిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, పరిశ్రమలు, ఉద్యోగాలు, సంక్షేమం వంటి అన్ని రంగాలపై సమగ్ర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**అనుభవం ఉన్న నాయకుడైతే నిర్ణయాల్లో తేడా ఉంటుందా**

ఇదే ఈ చర్చలో అసలు అంశం. రాజకీయాల్లో అనుభవం పెరిగేకొద్దీ నాయకుడికి వ్యవస్థలోని బలహీనతలు, ప్రజల అంచనాలు, అధికార యంత్రాంగం పని తీరు, ప్రతిపక్షాల వ్యూహాలు, ప్రాంతీయ సమస్యలపై మరింత అవగాహన ఏర్పడుతుందని రాజకీయ వర్గాలు భావిస్తాయి. ముఖ్యంగా సంక్షోభ సమయంలో భావోద్వేగంతో కాకుండా అనుభవంతో నిర్ణయం తీసుకునే నాయకత్వం రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్న అభిప్రాయం ఉంది.రాష్ట్ర పరిపాలనలో ప్రస్తుతం కూడా దీర్ఘకాలిక ప్రణాళికలు, సంస్కరణలు, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అనుభవజ్ఞుడైన నాయకత్వం ఉంటే త్వరిత నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు, ప్రజలతో నేరుగా అనుసంధానం వంటి అంశాల్లో మంచి మార్పు వచ్చే అవకాశం ఉందన్నది ఈ వాదన.

**ప్రజల కోణంలో ఆలోచించే నాయకత్వం కావాలి**

ప్రజలకు సీఎం ఎవరు అన్నది కేవలం రాజకీయ పదవి కాదు. తమ సమస్యకు స్పందించే వ్యక్తి ఎవరు.. తమ మాట వినే ప్రభుత్వం ఉందా.. రైతుకు సాగునీరు, యువతకు ఉద్యోగం, పేదలకు సంక్షేమం, పట్టణాలకు మౌలిక సదుపాయాలు అందుతున్నాయా..అనే ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ సమస్యలన్నింటినీ అర్థం చేసుకుని, విభాగాల మధ్య సమన్వయం చేస్తూ ముందుకు నడిపించే నాయకత్వం అవసరమన్న భావన బలంగా ఉంది.అందుకే హోమ్ మినిస్టర్ అయితే ఒక శాఖను నడిపించగలరు.. కానీ సీఎం అయితే రాష్ట్ర దిశను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అన్న మాట రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అనుభవం ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి అయితే పాలనలో కొత్త ఆలోచనలు, కఠిన నిర్ణయాలు, పరిపాలనా సంస్కరణలు, ప్రజలకు చేరువైన విధానాలు రావచ్చన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

**పదవి కోసం కాదు..**
**మార్పు కోసం సీఎం కావాలి**

ఇది వ్యక్తిగత పదవి కోరికగా చూడకూడదన్న అభిప్రాయం కూడా ఉంది. ఎందుకంటే రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ నాయకుడి అనుభవం ద్వారా రాష్ట్రానికి ఉపయోగపడే శాశ్వత మార్పు వస్తేనే ఆ పదవికి అసలు విలువ ఉంటుందని అంటున్నారు. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు.. పాలన విధానంలో ప్రజలకు నమ్మకం కలిగించడం కూడా సీఎం బాధ్యతలో కీలక అంశం.ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పాలన, అభివృద్ధి, సంక్షేమంపై అధికార,ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు, గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పనితీరు వంటి అంశాలపై కూడా రాజకీయ వేడి పెరిగింది. ఇలాంటి సమయంలో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడికి అత్యున్నత బాధ్యతలు అప్పగించాలన్న అభిప్రాయం సహజంగానే చర్చకు వస్తోంది.

"హోమ్ మినిస్టర్ కాదు.. సీఎం కావాలి" అన్న మాట వెనుక ఉన్న భావన ఒక్కటే అనుభవం ఉన్న నాయకుడి సామర్థ్యాన్ని ఒకే శాఖకు పరిమితం చేయకుండా, రాష్ట్ర భవిష్యత్తు కోసం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. ఆయన ముఖ్యమంత్రి అయితే అన్నీ ఒక్కరోజులో మారిపోతాయని కాదు.. కానీ తన రాజకీయ, పరిపాలనా అనుభవంతో ఏదో ఒక మంచి మార్పుకు శ్రీకారం చుట్టగలరన్న నమ్మకం మాత్రం ఉంది. అదే ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న ఈ అభిప్రాయానికి అసలు బలం.ఆయన మరెవరో కాదు తెలంగాణ పెద్దలు మన పెద్దాయన కుందూరు జానారెడ్డి.

# ఎఫ్ఐఆర్ నమోదయ్యే వరకు కదలను

- పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్ వద్ద కాంగ్రెస్ అగ్రనేత ధర్నా
- జంతర్‌మంతర్ ఘటనలో గాయపడిన విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్
- సోదరి ప్రియాంకతో కలిసి పోలీసు అధికారులతో రాహుల్ మంతనాలు
- సాహిల్ లోచవ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టీకరణ



**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ న్యూఢిల్లీ పోలీసులకు సవాల్ విసిరారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు కదిలేది లేదంటూ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుటే ధర్నాకు దిగారు. జులై 20న జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనల్లో పెల్లెట్ గన్ కాల్పుల్లో గాయపడిన విద్యార్థి సాహిల్ లోచవ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీతో పాటు ఆయన సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసు అధికారులతో రాహుల్ నేరుగా చర్చలు జరిపారు. తనపై జరిగిన దాడికి సంబంధించి ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని సాహిల్ ఆరోపించిన నేపథ్యంలో రాహుల్ ఈ నిరసనకు దిగారు.ఫిర్యాదు తీసుకుని ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయరు అంటూ పోలీసులను రాహుల్ ప్రశ్నించారు. బాధిత విద్యార్థికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. సాహిల్ లోచవ్ కూడా రాహుల్‌తో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాలో కూర్చున్నారు. దీంతో పార్లమెంట్ స్ట్రీట్ వద్ద రాజకీయంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కలకలం

**ప్రజా వాయిస్,న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీని స్వైన్‌ఫ్లూ భయం వెంటాడుతోంది. ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో హెచ్1ఎన్1 కేసులు ఒక్కసారిగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు 1,349 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయానికి కేవలం 229 కేసులు మాత్రమే నమోదవగా.. ఈసారి దాదాపు ఆరు రెట్లు పెరగడం కలకలం రేపుతోంది.

**వాతావరణ మార్పులతో వైరస్ విజృంభణ**

వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పులు శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వ్యాప్తికి అనుకూలంగా మారుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. స్వైన్‌ఫ్లూతోపాటు ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల బాధితుల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది.

**వైద్య సిబ్బందికీ వైరస్ సెగ**

స్వైన్‌ఫ్లూ బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బందిలోనూ హెచ్1ఎన్1 లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.





**ఆక్సిజన్ పడిపోతే ప్రమాదమే**

కొంతమంది బాధితుల్లో ఇన్ఫెక్షన్ తీవ్రత పెరిగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వైద్య వర్గాలు చెబుతున్నాయి. మరికొందరిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోతుండటంతో ప్రత్యేక పర్యవేక్షణ అవసరమవుతోంది. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, నిరంతర జ్వరం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

**అప్రమత్తతే ఆయుధం**

స్వైన్‌ఫ్లూ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. దగ్గు, తుమ్ముల సమయంలో జాగ్రత్తలు పాటించడం, చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, అనారోగ్యంతో ఉన్నవారికి దూరంగా ఉండటం ద్వారా వైరస్ వ్యాప్తిని కొంతవరకు అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

# ఉమ్మడి వరంగల్‌లో సామాజిక న్యాయం ఎక్కడ

వారు ప్రస్తావిస్తున్నారు. సుందర్ రాజ్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర వంటి నేతలకు కూడా కీలక అవకాశాలు దక్కాయని చెబుతున్నారు.

**ఏకైక బీసీ ఎమ్మెల్యేను ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాని టాక్.**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనరల్ కోటాలో గెలిచిన ఏకైక బీసీ ఎమ్మెల్యే కొండా సురేఖ. అంతేకాదు, ఆమె రాష్ట్ర మంత్రిగా కూడా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాంటి నాయకురాలి చుట్టూ వరుసగా రాజకీయ వివాదాలు తలెత్తడం, కొండా కుటుంబంపై అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతోందన్న ప్రచారం బీసీ వర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది.ఈ పరిణామాలను కొండా వర్గం రాజకీయంగా తమపై జరుగుతున్న ఒత్తిడిగా చూస్తుండగా, బీసీ వర్గాలు దీనిని సామాజిక ప్రాతినిధ్య కోణంలో కూడా విశ్లేషిస్తున్నాయి.

**కొండా ఫ్యామిలీని పక్కన పెడితే.. ఎఫెక్ట్ ఎక్కడ.**

కొండా కుటుంబానికి వరంగల్ తూర్పు మాత్రమే కాకుండా పరకాల, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో కూడా రాజకీయ, సామాజిక ప్రభావం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది. అందువల్ల కొండా కుటుంబాన్ని పూర్తిగా పక్కన పెడితే ఉమ్మడి వరంగల్‌లోని పలు నియోజకవర్గాలపై ప్రభావం పడే అవకాశం ఉందని వారి మద్దతుదారులు చెబుతున్నారు. గతంలోనూ ఈ ప్రాంతాల్లో కొండా దంపతుల రాజకీయ పట్టుపై చర్చ జరిగింది.పరకాల టికెట్ వ్యవహారంపై ముందస్తు ప్రకటనలు, ఆశావహుల భవిష్యత్తుపై చర్చ కూడా ఇదే సమయంలో రాజకీయంగా వేడెక్కుతోంది. జాతీయ పార్టీలో అభ్యర్థుల ఎంపిక అనేది పార్టీ అంతర్గత చర్చలు, స్థానిక పరిస్థితులు, ఆశావహుల అభిప్రాయాల తర్వాత జరగాల్సి ఉండగా ముందస్తు ప్రకటనలు ఎందుకన్న ప్రశ్న కొండా వర్గం నుంచి వినిపిస్తోంది.

**రెడ్లకు క్లీన్‌చిట్.. బీసీలకు నోటీసులా..**

పార్టీ క్రమశిక్షణ విషయంలో కూడా రెండు రకాల ప్రమాణాలు అమలవుతున్నాయంటూ బీసీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై కొందరు నాయకులు బహిరంగ విమర్శలు చేసినా చర్యలు ఉండవని, అదే బీసీ నాయకులు మాట్లాడితే వెంటనే వివరణలు, నోటీసులు, క్రమశిక్షణ చర్యల మాట వస్తోందని వారు వాదిస్తున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వంటి నేతల వ్యాఖ్యలను ఉదాహరణగా చూపుతూ రెడ్లు మాట్లాడితే సహనం.. బీసీలు మాట్లాడితే చర్యలా.. అని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.ఈ ఆరోపణలకు కాంగ్రెస్ నాయకత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేస్తున్నారు.

# పార్టీ ఫిరాయింపులపై 'క్లైమాక్స్'





**ప్రజా వాయిస్,హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారం కీలక దశకు చేరింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై హైకోర్టులో శుక్రవారం వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16న తీర్పు వెలువరించనున్నట్లు ప్రకటించడంతో.. ఇప్పుడు అందరి చూపూ ఆ రోజుపైనే పడింది.

**స్పీకర్ నిర్ణయమే సవాల్..**

దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకటరావు, సంజయ్‌కుమార్‌లపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం చట్టబద్ధత, అనర్హత పిటిషన్లపై అనుసరించిన విధానంపైనే ప్రధానంగా న్యాయస్థానం ముందు వాదనలు సాగాయి.

**ఆధారాలు పరిగణనలోకి తీసుకోలేదు**

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు.. స్పీకర్ నిర్ణయం తీసుకునే సమయంలో పరిగణనలోకి తీసుకున్న ఆధారాలను తమకు అందించలేదని వాదించారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తే.. అది పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లుగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, నామినేషన్ సమయంలో సమర్పించిన ఫారం–26 అఫిడవిట్లను ఆధారాలుగా కోర్టు ముందుంచారు. కాంగ్రెస్ తరఫున ప్రచారం చేసినట్లు పేర్కొంటూ ఎమ్మెల్యేల వీడియోలు, మీడియా కథనాలను కూడా సమర్పించారు.

**ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే పార్టీ మారడమా.?**

మరోవైపు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడం మాత్రమే పార్టీ మారినట్లు భావించలేమని పేర్కొన్నారు. తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు నిర్ధారించే ఆధారాలు లేవని వాదించారు.

**తీర్పుపైనే ఉత్కంఠ..**

ఇరుపక్షాల వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16న వెలువడనున్న తీర్పు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంతోపాటు రాష్ట్ర రాజకీయాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. హైకోర్టు తీర్పు ఎలాంటి మలుపు తిప్పుతుందన్న దానిపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# అక్రమ షెడ్లు సిద్ధం'
# అధికారులు నోటీసులకే పరిమితం.!

- ఇందిరాగాంధీ సొసైటీలో కూల్చివేతల మాటలు నీటిమూటలేనా.?
- నివాస ప్రాంతంలో యథేచ్ఛగా వాణిజ్య నిర్మాణాలు
- సొసైటీ పాలకవర్గం మౌనం వెనుక మర్మమేంటి.?

**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఇందిరాగాంధీ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అక్రమ నిర్మాణాల పర్వం అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది.నివాస అవసరాల కోసం కేటాయించిన స్థలంలో భారీ కమర్షియల్ షెడ్లు వెలుస్తున్నా,టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం కేవలం నోటీసులకే పరిమితం చేస్తూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో కూల్చివేతలు చేపట్టి హెచ్చరికలు జారీ చేసిన అధికారులు,ఇప్పుడు నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరుకున్నా కంటితుడుపు చర్యలతో మమ అనిపిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో అత్తాపూర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుధాకర్ కూల్చివేతలు చేపడతామని ప్రకటించినప్పటికీ,ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయానికి బదిలీ కావడం అక్రమార్కులకు కలిసివచ్చింది.ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ శ్రీధర్,స్థానిక టీపీఎస్ బి.విశాల్‌రెడ్డిల పరిధిలోనే ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల ఉదాసీనతతో బిల్డర్లు బహిరంగంగానే పనులను వేగవంతం చేస్తున్నారు.నివాస ప్రాంతంలో భారీ షెడ్ల వల్ల భవిష్యత్తులో తీవ్రమైన ట్రాఫిక్,పార్కింగ్,డ్రైనేజీ సమస్యలు తలెత్తుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు సొసైటీ పాలకవర్గం కూడా మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి,ఆ అక్రమ షెడ్లను తక్షణమే కూల్చివేసి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

**నోటీసులు ఇచ్చి చేతులు దులుపుతున్న అధికారులు**

గతంలో ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమ షెడ్ల నిర్మాణాలకు పదుల సంఖ్యలో నోటీసులు జారీ చేశారు.అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అధికారుల కనుసన్నలోనే ఈ అక్రమ షెడ్ల జాతర కొనసాగుతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నోటీసులు ఇవ్వడం ఎందుకు.? చర్యలు తీసుకోకుండా ఖామోష్ ఉండడం దేనికి సంకేతం అని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో వెలుస్తున్న అక్రమ వ్యాపార సముదాయాలను నేలమట్టం చేసి తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ట్రాఫిక్ రద్దీ నివారణకు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటు

**ప్రజా వాయిస్ హన్మకొండ** / కాజీపేట వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎల్అండ్ఓ రాయల ప్రభాకర్, ఏసీపీ ట్రాఫిక్ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు పలు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఆదాలత్ జంక్షన్‌లో మూడు వైపులా, ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఒక వైపు మొత్తం 54 సిమెంట్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.




# ఈ రహదారి వేయడం కోసమా...
# నరకం చూపడమా..

- కనీసం అంబులెన్స్ వెళ్లేని పరిస్థితి
- మంచిగున్నా రోడ్డునే తవ్వేశారు

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** అంతకంతకు మంచిగా ఉన్న రోడ్డును బీటీ రోడ్డు నిర్మాణం పేరుతో అడ్డగోలుగా తోవ్వేస్తున్నారు . దాని వెంటేనే రోడ్ రోలర్ తో తొక్కియాలి .. అలా కాకుండా కిలోమీటర్ల కొద్ది రోడ్డును హిటాచి, డోజర్లతో మంచిగా ఉన్న రోడ్డును మరమ్మతుల పేరుతో రోడ్డును తవ్వి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా అత్యవసర సమయానికి చేరుకోవాల్సిన అంబులెన్స్ సైతం చేరుకోలేని పరిస్థితి. సాక్షాత్తు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సొంత నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితి. అందోల్ మండలం సంగుపేట చౌరస్తా నుంచి పోచారం, మధుమాణిక్యం నుంచి మినుపూర్ చౌరస్తా వరకు బి టీ రోడ్డు నిర్మాణం కోసం నిదులు మంజూరు చేశారు. టెండర్ దగ్గించుకున్న కాంట్రాక్టర్ మిన్పూర్ చౌరస్తా నుంచి ముధుమాణిక్యం వరకు ఎలాంటి గుంతలు లేకుండా ఉన్న రోడ్డును తవ్వేశారు. కనీసం ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, వెళ్లడం కాదు కదా 108 అంబులెన్స్ కూడా వెళ్లానీ పరిస్థితి . ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డును తవ్విన వెంటనే రోడ్ రోలర్లతో సరిచేసి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చేయవలసిన బాధ్యత కాంట్రాక్టు పై ఉంది. కానీ ఇక్కడ మాత్రం ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ బీటీ రోడ్డును తొలగించి అర్ధాంతరంగా వదిలివేస్తూ వెళ్తున్నారు. దీంతో వాహన దారులు కాదు కనీసం 108 వాహనం కూడా సరైన సమయానికి వెళ్ళని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రోడ్ల భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి వరకు తాత్కాలికంగా వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది. సంగుపేట నుంచి మధుమాణిక్యం వరకు గత నెల రోజుల క్రితం సుమారు 12 కిలోమీటర్లు ఉన్నా బి టీ రోడ్డును తవ్వేశారు. మరమతుల పనులు మాత్రం అంతంతగా సాగుతున్న బీటీ రోడ్డు మేడమ్ మాత్రం కాంట్రాక్టర్లు మర్చిపోతున్నారు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



# మత్తు మాయలో రక్తచరిత్ర రాస్తున్న యువత

- విలువలు కోల్పోతున్న వ్యవస్థ.. రక్తపు మడుగులో సమాజం
- మద్యం.. అక్రమ సంబంధాలు.. చిద్రమవుతున్న కుటుంబ బంధాలు
- సెంటు భూమి కోసం సొంత రక్తాన్నే చిందిస్తున్న అన్నదమ్ములు
- చలానాలతో ప్రమాదాలు ఆగవు.. ప్రాణం పోతే తిరిగిరాదు
- చూస్తూ ఊరుకుంటున్న సమాజం.. చేతులెత్తేస్తున్న వ్యవస్థ
- డ్రగ్స్ కట్టడిలో వైఫల్యం.. భూ వివాదాల పరిష్కారంలో జాప్యం
- కుటుంబ విలువలు కాపాడితేనే విషవలయానికి అడ్డుకట్ట




**ప్రజా వాయిస్,సూర్యాపేట బ్యూరో చీఫ్:** ఒకప్పుడు గ్రామమంటే గుడి చుట్టూ అల్లుకున్న బంధం. ఒకరి కష్టం మరొకరికి బాధ.. ఒకరి సంతోషం అందరికీ పండుగ. ఇప్పుడు అదే గ్రామాల్లో గంజాయి వాసన.. మద్యం మత్తులో తూలుతున్న యువత.. రోడ్లపై రక్తపు మడుగులు.. కోర్టుల చుట్టూ తిరుగుతున్న అన్నదమ్ములు.. పోలీస్‌స్టేషన్ల మెట్లెక్కుతున్న భార్యాభర్తలు కనిపిస్తున్నారు. విడివిడిగా జరిగే ఘటనలుగా కనిపిస్తున్నా.. వీటన్నింటి వెనుక విలువలు కోల్పోతున్న సమాజమే ప్రధాన కారణం.

**మత్తు..హత్యలకు పునాది**

మద్యం నుంచి గంజాయి, డ్రగ్స్ వరకు మత్తు పదార్థాల ప్రభావం యువతపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా 18 నుంచి 30 ఏళ్ల వయసు వారిలో కొందరు ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి చిన్నపాటి గొడవలకే దాడులు, హత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. డబ్బు కోసం కన్నవారిపైనే దాడులకు తెగబడే దుస్థితి మరింత కలవరపెడుతోంది.

**ప్రమాదాలకు మరో కారణం.. మద్యం**

రాత్రివేళ మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఒకే బైక్‌పై ముగ్గురు వెళ్లడం వంటి నిర్లక్ష్యాలు నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఒక ప్రమాదం ఒక్కరి ప్రాణాన్నే కాదు.. మొత్తం కుటుంబ భవిష్యత్తునే ఛిద్రం చేస్తోంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోతే భార్యాపిల్లలు అప్పుల ఊబిలోకి జారిపోతున్నారు.

**సెంటు భూమి కోసం.. సొంత రక్తమే శత్రువు**

భూముల ధరలు పెరగడంతో ఆస్తి వివాదాలు రక్తసిక్తమవుతున్నాయి. సర్వే రాళ్ల నుంచి వారసత్వ హక్కుల వరకు చిన్నచిన్న వివాదాలు పెద్ద గొడవలకు దారితీస్తున్నాయి. ఒకప్పుడు గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కారమయ్యే సమస్యలు ఇప్పుడు ఏళ్ల తరబడి కోర్టుల్లో నలుగుతున్నాయి. చివరకు కొన్నిసార్లు హత్యలకు దారితీస్తున్నాయి.

**అక్రమ సంబంధాలు.. కూలుతున్న కుటుంబాలు**

సెల్‌ఫోన్, సోషల్ మీడియా వ్యసనం.. భార్యాభర్తల మధ్య తగ్గుతున్న సంభాషణ.. అనుమానాలు కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాయి. అక్రమ సంబంధాల ఆరోపణలతో హత్యలు, దాడులు చోటుచేసుకుంటున్నాయి. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందన్న ఆలోచన లేకుండా తీసుకునే ఒక్క నిర్ణయం మొత్తం కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టేస్తోంది. ఇప్పటికైనా మేల్కొందాం.. విలువలను కాపాడుకుందాం రక్తపు మరకలు లేని సమాజాన్ని నిర్మిద్దాం.




# సాగర్ నీళ్లు ఆంధ్రకు.. నల్లగొండ రైతులకు కరువు

- సాగర్‌లో 30 టీఎంసీలు అందుబాటులో ఉన్నా ఎడమ కాల్వ, లిఫ్టులకు నీళ్లు విడుదల చేయని ప్రభుత్వం
- శ్రీశైలం నీటి దోపిడీపై జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని తీవ్ర విమర్శలు
- కేసీఆర్ హయాంలో 17 సార్లు సాగునీరు ఇచ్చాం
- ఇప్పుడు నీళ్లు ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- వెంటనే సాగర్ ఆయకట్టుకు నీళ్లు విడుదల చేయాలి
- లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఉద్యమం తప్పదని హెచ్చరిక
- జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఫైర్

జా వాయిస్,నల్లగొండ. నాగార్జునసాగర్ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు యథేచ్ఛగా తరలిస్తుండగా, నల్లగొండ జిల్లా రైతులకు మాత్రం సాగునీరు అందకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కరువు పరిస్థితులు సృష్టిస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపు జరుగుతున్నా జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించకుండా నిద్రపోతున్నారని మండిపడ్డారు.నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 532 అడుగుల నీటిమట్టం, సుమారు 30 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎడమ కాల్వతో పాటు లిఫ్ట్‌లకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఇంతకంటే తక్కువ నీరు ఉన్నప్పటికీ వరుసగా 17 సార్లు రైతులకు సాగునీరు అందించామని, చెప్పి మరీ నీళ్లు ఇచ్చి చూపించామని పేర్కొన్నారు.శ్రీశైలానికి వస్తున్న నీటిని న్యాయంగా నాగార్జునసాగర్‌కు విడుదల చేయాల్సి ఉండగా, పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు నిండిపోతూ పంటలు సాగుతుంటే, తెలంగాణలోని సాగర్ ఆయకట్టు రైతులకు మాత్రం నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు 148 టీఎంసీల నీటిని పోతిరెడ్డిపాడు ద్వారా తరలించుకున్నారని ఆరోపించారు.సాగర్ నీళ్లు ఆంధ్రకు.. నల్లగొండ రైతులకు కరువు అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తోందని జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది ఎల్‌నినో తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కరువని విమర్శించారు. వెంటనే నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, లిఫ్ట్‌లకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించకపోతే కేసీఆర్‌తో చర్చించి బీఆర్ఎస్ తరపున పెద్దఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.సాగర్ నీళ్లు మా హక్కు.. ఎలాగైనా సాధించి తీరుతాం అని స్పష్టం చేశారు.ఈ ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర రావు, ఒంటెద్దు నరసింహారెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పెర్కపల్లి గ్రామ పంచాయతీ నిధుల్లో
# రూ.35.72 లక్షల నిధుల గోలమాల్

- విచారణ లెక్కల్లో తేడాలు, దుర్వినియోగం, ఆడిట్ అభ్యంతరాలు
- ప్రజాధనం రికవరీ చేయాలని గ్రామస్థుల డిమాండ్.

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలములోని పెర్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అప్పటి సర్పంచ్ రామగౌని పద్మావతి సర్పంచిగా ఉన్న సమయంలో 2019–20, 2020–21 సంవత్సరాల్లో గ్రామ అభివృద్ధి కోసం వినియోగించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, ఎన్ఆర్ జీఏస్ నిధులపై గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి, మంచిర్యాల ఆధ్వర్యంలో విచారణ నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు.విచారణలో మొత్తం రూ.35,72,959 మేరకు లెక్కల్లో తేడాలు, విధానపరమైన లోపాలు, నిధుల దుర్వినియోగం, ఆడిట్ అభ్యంతరాలు ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. ఇందులో విధానపరమైన లోపాలకు రూ.21,32,773, దుర్వినియోగానికి రూ.10,83,532, ఆడిట్ అభ్యంతరాలకు రూ.3,56,654గా గుర్తించినట్లు తెలిపారు.అలాగే పంచాయతీకి సంబంధించిన క్యాష్‌బుక్స్, ఎంబీ రికార్డులు, ఎఫ్‌టీఓలు సమర్పించకపోవడంతో అభివృద్ధి పనుల నిర్వహణపై కూడా విచారణలో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు గ్రామస్థులు వెల్లడించారు.పంచాయతీ రాజ్ చట్టం–2018లోని సెక్షన్ 43 ప్రకారం సంబంధిత అప్పటి సర్పంచ్ రమగౌని పద్మావతి మరియు పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు విచారణలో పేర్కొన్నట్లు తెలిపారు.ప్రజావాణిలో ఫిర్యాదుఈ వ్యవహారంపై 2026 ఆగస్టు 17న ప్రజావాణి ద్వారా (గ్రీవేన్స్ ఐడి : డిఎంఎన్ సి ల్ 17082600001తో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఫిర్యాదును పరిష్కారం కోసం బెల్లంపల్లి మండల పంచాయతీ అధికారికి పంపినట్లు పేర్కొన్నారు.ప్రజాధనం రికవరీ చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలివిచారణలో గుర్తించిన అవకతవకలకు సంబంధించి బాధ్యుల నుంచి ప్రజాధనాన్ని వెంటనే రికవరీ చేసి, అదే నిధులతో పెర్కపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల కోసం కేటాయించిన నిధుల దుర్వినియోగం చేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# రూపారెడ్డి హత్యను ఖండిస్తూ ట్రస్మా భారీ ర్యాలీ

- ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్




**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.** నాగార్జున కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (TRSMA) ఆధ్వర్యంలో మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహించారు. క్యాంప్ గ్రౌండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని రూపారెడ్డి హత్యపై తమ ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా TRSMA నాయకులు ఎమ్మెల్యే, డీఎస్పీ, ఆర్డీఓలకు ప్రాతినిధ్య పత్రం అందజేశారు. కల్లు రూపారెడ్డి హత్య ఘటనతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని పేర్కొన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులు తమ విధులను స్వేచ్ఛగా, భయరహిత వాతావరణంలో నిర్వహించేలా చట్టపరమైన రక్షణ కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై జరిగే బెదిరింపులు, దాడులు, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల క్రమశిక్షణ, ప్రవర్తన, భవిష్యత్తుపై తల్లిదండ్రుల బాధ్యత పెరిగేలా ప్రభుత్వం, ప్రజా సంఘాలు, విద్యా సంస్థలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.యువతలో డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ విక్రయాలు, సరఫరా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల పరిసరాల్లోని దుకాణాలు, ఇతర వాణిజ్య కేంద్రాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులు విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయుల భద్రత కోసం షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేయాలని, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు చట్టపరమైన అంశాలు, సైబర్ భద్రత, డ్రగ్స్ నివారణ, విద్యార్థుల ప్రవర్తన, మహిళా భద్రత వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల కీలక పాత్రను గుర్తిస్తూ వారి గౌరవం, ప్రతిష్టను పెంచే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా పాఠశాల యాజమాన్యాలు తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి త్వరగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక నోడల్ అధికారి లేదా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, అత్యవసర ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రాతినిధ్య పత్రంలో కోరారు.ఈ ర్యాలీకి మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, వార్డు కౌన్సిలర్ దేశరెడ్డి శేఖర్‌రెడ్డి మద్దతు తెలిపారు. వారు క్యాంప్ గ్రౌండ్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీలో పాల్గొని TRSMAకు సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో TRSMA జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, వంగాల నిరంజన్‌రెడ్డి, మారుతి అమరేందర్‌రెడ్డి, అలుగువెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, కేకే జయరాజన్, అయ్యన్న, శ్రీపతి శ్రీనివాస్, సాయి శ్రీనివాస్, మహమ్మద్, మల్లు రవీందర్‌రెడ్డి, కందాల శ్రీనివాసాచారి, బొడ్డుపల్లి వరప్రసాద్, అనంతుల సోమయ్య, కందుల మధుసూదన్, ఓరుగంటి శ్యామ్, రియాజ్, పెంట రాజు, సైదులు, శ్రీధర్‌రెడ్డి, దోనాల రాంరెడ్డి, నీలిమ, చంద్రకళ, అనిత, ఉమా, శ్రీకాంత్, వెంకట్, నర్సిరెడ్డి, చార్లెస్, కలీం, సురేందర్‌రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హతలు లేకుండా అక్రమంగా జాయిన్ అయిన నకిలీ అధ్యాపకులను తొలగించండి

- సహకరించిన మిర్యాలగూడ జూనియర్ కళాశాల అప్పటి ప్రిన్సిపాల్, ప్రస్తుత ప్రిన్సిపాల్ లను సస్పెండ్ చేయండి.
- ఇంటర్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ ను కోరిన బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం
- జీ.వో 16 ద్వారా రెగ్యులర్ అయిన అర్హత లేని, నకిలీ లెక్చరర్ కేసును సి.బి.సి.ఐ.డి కి అప్పగించాలని డిమాండ్

**ప్రజా వాయిస్,హైదరాబాద్.** జీ.వో ఎంఎస్ నెంబర్ 212 తేదీ :24-11-2010 శాంక్షన్ పోస్టుల అర్హత నిబంధనలకు విరుద్ధంగా మిర్యాలగూడ బధిర జూనియర్ కళాశాలలో విద్యా అర్హతలు లేకుండా అక్రమంగా జాయిన్ అయి, ఇప్పుడు జీ.వో ఎంఎస్ నెంబర్ 212, జీ.వో 16 నిబంధనలకు విరుద్ధంగా 03/05/2023 లో రెగ్యులర్ అయిన జూనియర్ లెక్చరర్ల ఇరుగు మధుకర్, కట్ల వెంకటేశ్వర్లు, గొల్ల స్వామి ను తొలగించి.. వీరికి సహకరించిన సంబంధిత సెలక్షన్ కమిటీ అధికారులు, ప్రిన్సిపల్, డిఐఈఓ లపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పూర్తి ఆధారాలతో ఇంటర్ బోర్డు సెక్రటరీ/ కమిషనర్ అభిలాష అభినవ్ ఐ.ఎ.ఎస్ ను ఇంటర్ బోర్డు కార్యాలయం లో బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం కోరారు...తదనంతరం ఆయన మాట్లాడుతూ.. వినికిడి మరియు వాక్ లోపం ఉన్న బధిర విద్యార్థుల కోసం బోధించాలంటే అర్హతగా సంబంధిత పీజీ సబ్జెక్టు ఎం.ఏ. హిస్టరీ/ ఇంగ్లీష్/ తెలుగు/ ఎకనామిక్స్/ పౌరశాస్త్రం లో కనీసం సెకండ్ క్లాస్ తో, 50 శాతం కంటే తక్కువ కాకుండా మార్కులు ఉండాలి. దీని తోపాటుగా యు.జీ.సి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/సంస్థ నుండి ఆర్.సి.ఐ ఆమోదించిన బి.ఈడి వినికిడి లోపం ఉన్నవారి కోసం ప్రత్యేక విద్య ఉండాలి ఇవేవీ లేకుండా వీరిని సెలక్షన్ ఎలా చేశారని ప్రశ్నించారు.“ఇరుగు మధుకర్ 2012 లో నిబంధనలకు విరుద్ధంగా బధిర జూనియర్ కళాశాలలో జాయిన్ అయి ఇతను ఎలాంటి ఎన్ఓసి తీసుకోకుండా 2013- 2015 విద్యా సంవత్సరంలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో బీఈడీ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ చేశారు. ఎవరైనా ఒక అభ్యర్థి ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగాలనుకుంటున్నప్పుడు అతని పూర్తి విద్యార్హతలు సంబంధిత కార్యాలయానికి తెలియపరచాలి.. కానీ ఇతని ఏమీ పాటించకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 2008 - 2020 లో ఫుల్ టైం పీహెచ్డీ ఇన్ తెలుగు విషయాన్ని దాచిపెట్టి జాబ్ లో జాయిన్ అయ్యారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగంలో కొనసాగుతూనే ఈ ఫుల్ టైం పీహెచ్డీ 2020 సంవత్సరంలో పూర్తి చేశారన్నారు”“కట్ల వెంకటేశ్వర్లు 2011 లో నిబంధనలకు విరుద్ధంగా బధిర జూనియర్ కళాశాలలో జాయిన్ అయి ఇతను ఎలాంటి ఎన్.ఓ.సి తీసుకోకుండా 2011- 2013 విద్యా సంవత్సరంలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో బీఈడీ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ చేశారన్నారు” “గొల్ల స్వామి 2006-2009 మధ్యలో బాపట్లలో గల గవర్నమెంట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో తెలుగు ఫ్యాకల్టీ కాంట్రాక్టర్ లెక్చరర్ గా పనిచేశాడు. గుంటూరు జిల్లాలో ఇతని జోన్ కానప్పటికీ అక్కడ తన సెలెక్ట్ అయిన విధానంలో మాకు అనుమానం ఉంది.. ఈ గుంటూరు జిల్లాలో చేసినటువంటి ఎక్స్పిరియన్స్ తీసుకొచ్చి మిర్యాలగూడ బధిర జూనియర్ కళాశాలలో సాంక్షన్ తెలుగు పోస్టుల ఇంటర్వ్యూకు సబ్మిట్ చేశాడు.. ఈ యొక్క ఎక్స్పిరియన్స్ ని పక్కన పెట్టిన కమిటీ చైర్మన్ ఇతన్ని సెలెక్ట్ చేసుకోలేదు అని సమాచారం.. కానీ యొక్క ఇతని సెలక్షన్ పక్కన పెట్టిన చైర్మన్ .. మరుసటి రోజు సెలెక్ట్ అయినట్టుగా వచ్చిన సెలక్షన్ క్యాండిడేట్ లిస్టులో ఇతని పేరు ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. మిర్యాలగూడ ప్రభుత్వ బధిర కళాశాలలో బదిరకు తెలుగు ఒప్పంద అధ్యాపకుడిగా గొల్ల స్వామి ని నవంబర్ 05, 2011 లో ఇతనిని తీసుకున్నారు. జీవో 16 ద్వారా 2023 లో రెగ్యులర్ అయినాడు.. రిహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆర్.సి.ఐ1992 యాక్ట్-13సి నిబంధనల ప్రకారం ప్రకారం వికలాంగులు.. బధిరుల కు విద్యను బోధించే ఉపాధ్యాయులకు/ అధ్యాపకులకు తప్పనిసరిగా ఆర్.సి.ఐ సర్టిఫికెట్ కలిగి ఉండి మరియు దానిని ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి సి.ఆర్.ఈ (CRE) కంటిన్యూ రిహబిలిటేషన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కు హాజరవుతూ 100 సి.ఆర్.ఈ పాయింట్స్ తో R.C.I Rehabilitation council of India సర్టిఫికెట్ను ఎలాంటి గ్యాప్ లేకుండా ఉండాలి, రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది... ఇలా చేసుకోకపోతే బదిరులకు, వికలాంగ విద్యార్థులకు విద్యను బోధించే అర్హతను కోల్పోతారు. ఇతను ఆర్.సి.ఐ సర్టిఫికెట్ లేకుండా కళాశాలలో బోధించడం రూల్స్ కు విరుద్ధం. ఈ గొల్ల స్వామి, తండ్రి ముత్యాలు అనే వ్యక్తి ఎప్పుడైతే బీఈడీ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్లో చేసినప్పటి నుండి కంటిన్యూస్గా ఆర్సిఏ సర్టిఫికెట్ కచ్చితంగా కలిగి ఉండాలి ఇందులో ఏ ఒక్క రోజు గ్యాప్ రాకూడదు.. కానీ ఇతని యొక్క ఆర్సీఐ సర్టిఫికెట్ 2006-2007, 2012 – 2021 వరకు గ్యాప్ ఉన్నది.. ఇతను ఎలాంటి సి.ఆర్.ఈ ప్రోగ్రాంలకు హాజరు కాకుండా ఎలాంటి సి.ఆర్.ఈ పాయింట్స్ లేకుండా ఆర్సిఐ సర్టిఫికెట్నులకి ఆన్లైన్లో అప్లై చేసినట్టు చూపెడుతూ మోసం చేశాడు.. కాబట్టి ఇతని Bed నుండి ఇప్పటివరకు ఎన్ని సంవత్సరాలు RCI సర్టిఫికెట్ గ్యాప్ ఉన్నదో చూసి ఆర్.సి.ఐ నిబంధనలను, ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో, నిష్పక్షపాతంగా విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరడమైనది ఆర్.సి.ఐ సర్టిఫికెట్ గ్యాప్ ఉన్నప్పుడు ఇతనికి సహకరించిన ప్రిన్సిపల్ మరియు ఇతని మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ R.C.I సంబంధిత వివరాలు పూర్తిగా తెలియాలంటే అదే కళాశాలలో పనిచేస్తున్నటువంటి నల్లగంటి రామకృష్ణ లెక్చరర్ ఇన్ పొలిటికల్ సైన్స్.. గతంలో మీకు కంప్లైంట్ చేసిన కాపీని చూడాలని..ఈ యొక్క ఎంక్వయిరీ లో అతనిని కూడా ఇన్వాల్వ్ చేయాలని, రెహబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (RCI), ఢిల్లీ వారికి లెటర్ రాయాల్సిందిగా ఇంటర్ బోర్డు సెక్రెటరీ ను కోరారు.ఈ విషయమై అప్పటి ప్రిన్సిపాల్, ఇప్పటి ప్రస్తుత ప్రిన్సిపాల్ కు ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఈ వ్యవహారం అంతా పై అధికారులకు తెలియకుండా, వెరిఫికేషన్ సమయంలో నిబంధనలు, విద్యారతల ప్రస్తావన ఇన్ని రోజులు దాచి ఉంచడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కాబట్టి నేను ఇచ్చిన పూర్తి ఆధారాలను పరిశీలించి సంబంధిత వ్యక్తుల పైన చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు సెక్రెటరీ ను కోరారు. అదేవిధంగా అర్హత లేకుండా, ఫేక్ సర్టిఫికెట్తో కాంట్రాక్టు లెక్చరర్ గా జాయిన్ అయి.. జీవో 16 ద్వారా రెగ్యులర్ అయిన లెక్చరర్ ల పైన ఈ రేవంత్ ప్రభుత్వం.. సి.బి.సి.ఐ.డి తో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి.. బాధ్యులను, వీరికి సహకరించిన సంబంధిత అధికారులు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మండల రెవెన్యూ కార్యాలయంలో టాయిలెట్ ను శుభ్రం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

- పెంట్లవెల్లి మండల రెవెన్యూకార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ
- రికార్డులను పరిశీలించిన మంత్రి
- అధికారుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ లో జాప్యంపై తీవ్ర ఆగ్రహం

**ప్రజా వాయిస్.. వనపర్తి** పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారుల నిర్లక్ష్యంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కార్యాలయంలోని టాయిలెట్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి స్వయంగా తానే దానిని శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు.పెంట్లవెల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన మంత్రి, ఆర్డీఓతో పాటు ఇతర సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్ ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి హితవు పలికారు.అదే సమయంలో కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిరసనగా ఆయనే స్వయంగా నీళ్లు పోసి మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడంతో అక్కడి సిబ్బంది అవాక్కయారు.అనంతరం పారిశుద్ధ్య సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తన వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందించారు. కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు.ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.





## నెలకు 350కే టోల్ పాస్

- ప్లాజాకు 20 కి.మీ పరిధిలోని వారికి
- వచ్చే నెల నుంచి అమలు ఎన్ హేచ్ఐఐ బంపర్ ఆఫర్

**ప్రజా వాయిస్,స్కంగారెడ్డి :** జాతీయ రహదారులపై తరచూ ప్రయాణించే స్థానిక వాహనదా రులకు ఊరట కలిగిస్తూ నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్హెచ్ ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రూ.350లకే నెలవారీ టోల్ పాస్ పొందే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. టోల్ ప్లాజాల వద్ద క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా, పూర్తి డిజిటల్ విధానంలో ఆన్లైన్ ద్వారానే ఈ-పాస్ పొందే సదుపాయాన్ని తీసుకురానుంది. అయితే, ఇంతకు ముందు టోల్ ప్లాజాల వద్దకు నేరుగా వెళ్తేనే లభించే నెలవారీ పాస్ సేవలను ఇప్పుడు పూర్తి డిజిటల్ రూపంలోకి మార్చారు. ఈ కొత్త ఆన్లైన్ పాస్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉన్న 121 టోల్ ప్లాజాలకు ఎన్హెచ్ఐఐ విస్తరించింది. దీంతో స్థానిక వాహనదారులు ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించ కుండానే ఇంటి నుంచే పాస్ పొందే అవకాశం లభించింది.నిర్దేశిత టోల్ ప్లాజా నుంచి 30 కి.మీ. పరిధిలో నివసిస్తున్న స్థానిక నివాసితులు మాత్రమే ఈ పార్టీకు అర్హులుగా ఎన్హెచ్ఎఐ గుర్తించనుంది. ఈ మంత్లీ ఫాస్ సదుపాయం కేవలం సొంత, ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఉద్యోగల, వ్యాపారం, ఇతర పనుల నిమిత్తం ప్రతిరోజూ ఒకే టోల్ ప్లాజా వాలే స్థానికులకు ఈ పాస్ ద్వారా భారీగా ఆర్థిక భారం తగ్గనుంది. ఈ ఆన్లైన్ దరఖాస్తు ప్రక్రియ కోసం ఎన్హెచ్ఎఐ వ్యవస్థను ప్రభుత్వ డేటాబేసులతో లింక్ చేశారు. దరఖాస్తుదారుడి ఇంటి ద్వారా అర్హతలు డిజిరాక్స్ , వాహనం వివరాలను, చిరునామాను నిర్ధారించడానికి 'వాహన్' పోర్టల్ను ఉపయో గించేస్తున్నారు. అడ్రస్ వాహన వివరాలు సరిపోలిన వెంటనే, లోకల్ పాస్ ఆటోమేటిక్ మీ వాహన ఫాస్టాగికి లింక్ కానుంది. అయితే ఈ డిజిటల్ లోకల్ పాస్ విధానాన్ని మొదట న్యూఢిల్లీలోని ముందా - అన్యర్వాలా టోల్ ప్లాజా వద్ద ఫైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించారు. అక్కడ విజయవంతం కావడంతో దీనిని దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలకు వచ్చే నెల నుంచి అమలు చేయనున్నారు .

**దరఖాస్తు ఇలా..**

మతిలి లోకల్ పాస్ కోసం అర్హులైన స్థానిక వాహనదారులు ఎన్హెచ్ఎనికి చెందిన అధికారిక రాజ్మార్ యాత్ర మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకుని ఈ లోకల్ పాసు పొందవచ్చు. టోల్ గేట్ల వద్ద వాహనాలు ఆగకుండా నేరుగా ప్రయాణించే మల్టీ లేవ్ ఫ్రీ ఫ్లో,బార్ కోడ్ విధానాన్ని టోలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టేల చర్యలు తీసుకునేందుకు ఎన్హెచ్ఎఐ సన్నాహాలు చేస్తోంది. సాధారణంగా పరిచయాలతో టోల్ స్థానిక వాహనా లకు, ఆటోమేటిక్ కెమెరాల ద్వారా పెండింగ్ టోల్ ఈ-నోటీసులు జారీ అవుతున్నాయి. ఈ డిజిటల్ పాసు ఫాస్టాగికి లింక్ చేయడం వల్ల స్థానికులకు ఎలాంటి అదనపు చార్జీలు, నోటీసులు రాకుండా నిరోధించే అవకాశం ఉంది.

## ‘వయ్యారి భామ’తో పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు

- పూత పూయకముందే వేర్లతో సహా తొలగించాలి:
- ఐసిఏఆర్ - నార్మ్ నిపుణులు
- బండ్లగూడ జాగీర్ పద్మశ్రీ హిల్స్ కాలనీలో నివారణ కార్యక్రమం

**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:** పచ్చదనం ముసుగులో కాలనీలు, మైదానాలు,పంట పొలాల్లో వేగంగా విస్తరిస్తున్న ‘వయ్యారి భామ’ (పార్థీనియం)కలుపు మొక్కలు పర్యావరణానికే కాకుండా మానవ ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని ఐసీఏఆర్-నార్మ్ సాంకేతిక విభాగం ప్రధాన అధికారి డాక్టర్ లక్ష్మణ్ ఎం.అహిరే హెచ్చరించారు. రాజేంద్రనగర్ సర్కిల్బండ్లగూడ జాగీర్ పరిధిలోని పద్మశ్రీ హిల్స్ కాలనీలో ఐసీఏఆర్-నార్మ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వయ్యారి భామ నిర్మూలన,అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ మొక్కల పుప్పొడి,ఆకుల ప్రభావం వల్ల ప్రజల్లో తీవ్రమైన అలర్జీలు,ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు,చర్మ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు.వయ్యారి భామ వేగంగా విస్తరిస్తూ భూమిలోని సహజ సారాన్ని పిండేయడంతో పాటు,స్థానిక వృక్షజాలాన్ని, పంట దిగుబడులను తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పువ్వులు పూసిన తర్వాత గాలి ద్వారా విత్తనాలు వేగంగా వ్యాపిస్తాయి కాబట్టి,పూత పూయకముందే వీటిని వేర్లతో సహా పెకిలించి వేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కలుపు మొక్కల సంపూర్ణ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్-నార్మ్కు చెందిన సుమారు 50 మంది సిబ్బంది,పద్మశ్రీ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానంలో భాగస్వాములయ్యారు.







## రాజ్యమేలుతున్న అవినీతి!

- ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు.. లంచాల వసూళ్లలో బిజీ!
- జీతం తీసుకుంటూ.. సేవలకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు
- వికారాబాద్ లోని పలువురు అధికారుల తీరుపై సామాన్యుల అసహనం
- లంచగొండితనానికి అడ్డుకట్ట వేసి.. సామాన్యులకు న్యాయం చేయాలి
- ఉన్నతాధికారులు నిఘా పెంచాలని డిమాండ్

**ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** ప్రభుత్వ అధికారులు ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించాల్సిన బాధ్యత ఉంది. ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ అదే ప్రజల పనులకు లంచాలు డిమాండ్ చేయడం అత్యంత హేయమైన చర్య. అయితే వికారాబాద్ జిల్లాలోని పోలీస్,రెవెన్యూ,పంచాయతీ రాజ్, ఆడిట్, ఎక్సైజ్,విద్యా, తదితర శాఖల్లో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది అవినీతికి పాలడుతున్నారని,వారి తీరుపై సామాన్య ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.చిన్నచిన్న ప్రభుత్వ పనుల కోసం,కేసుల విషయంలో కూడా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, లంచం ఇస్తేనే పనులు వేగంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అవినీతికి పాల్పడుతున్నారనే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచి, లంచాలకు తావులేకుండా ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మూతపడే స్థితి నుంచి.. ముచ్చటపడే స్థాయికి..!

- 15 మంది నుంచి 77 మందికి చేరిన పిల్లిగుండ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య
- ఉపాధ్యాయుల కృషి అమోఘం
- గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్ రెడ్డి
- ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మొహసిన్ ప్రత్యేక శ్రద్ధ పట్ల ప్రశంసల జల్లు

**ప్రజా వాయిస్/వికారాబాద్/మర్పల్లి:** ఒకప్పుడు కేవలం 15 మంది విద్యార్థులతో మూతపడే పరిస్థితిలో ఉన్న పిల్లిగుండ్ల ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాల నేడు 77 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఉపాధ్యాయుల చిత్తశుద్ధి, తల్లిదండ్రులు-గ్రామ ప్రజల సహకారం, వినూత్న బోధనా పద్ధతులు పాఠశాల రూపురేఖలను మార్చాయి.2024 జూన్‌లో 15 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మొహసిన్ బాధ్యతలు చేపట్టారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలోని విద్యా అవకాశాలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. దీంతో విద్యార్థుల సంఖ్య తొలుత 15 నుంచి 25కు, ఆపై 45కు పెరిగింది.

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన స్నాతకోత్సవం

యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు, తల్లిదండ్రుల సమావేశాలు, జాతీయ పర్వదినాల నిర్వహణతో పాఠశాలపై నమ్మకం పెరిగింది. దాతల సహకారంతో విద్యార్థులకు పాఠశాల కిట్లు, ప్లేట్లు తదితర సామగ్రి అందించారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థులు ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన సందర్భంగా స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రస్తుతం పాఠశాలలో 77 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మొహసిన్ తో పాటు ఉపాధ్యాయ బృందం సుప్రియ,సుందర్,అనూష లు చేస్తున్న కృషిని గ్రామ సర్పంచ్, ఎంఈఓ అశోక్, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.



### ఉపాధ్యాయులు కృషి అమోఘం: సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్ రెడ్డి

ఈ విజయంపై గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్ రెడ్డి ప్రత్యేకంగా స్పందిస్తూ.. ప్రధానోపాధ్యాయుడు ఎండీ మొహసిన్ చేపట్టిన ప్రత్యేక శ్రద్ధ, పాఠశాల ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సఫియ బేగం హాజీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల రాకతో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను కూడా మాన్పించి తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని తెలిపారు.అయితే 15 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల ప్రయాణం 77 మందికి చేరడం ప్రభుత్వ పాఠశాలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.





## మల్లికార్జున్ ఖర్గే కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేసిన మల్లికార్జున్ ఖర్గే

**ప్రజా వాయిస్.. వనపర్తి** వనపర్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఢిల్లీలో ఖర్గే నివాసంలో ఆయనను కలిసి ఫిర్యాదు చేశారు కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీఫార్మ్‌ను డబ్బులకు అమ్ముకున్నదంటూ, ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలనీ కోరారుఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదు పై సానుకూలంగా స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు ఎమ్మెల్యే మెగా రెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ వరలక్ష్మి



**ప్రజా వాయిస్ /మంచిర్యాల క్రైమ్** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు ఉక్కుపాదం మోపారు. మండలంలోని లింగాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న వరలక్ష్మి అవినీతి బాగోతం బట్టబయలైంది.గ్రామంలో ఒక ఇంటి నిర్మాణానికి సంబంధించి అనుమతులు (పర్మిషన్) మంజూరు చేసేందుకు ఆమె భారీగా డిమాండ్ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇల్లు కట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్న సామాన్యుడిని ఆసరాగా చేసుకొని, రూ.13,000 లంచం ఇవ్వాలని ఆమె పట్టుబట్టారు.దీనిపై బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు.ఈ దాడులతో జన్నారం మండలంలోని రెవెన్యూ మరియు పంచాయతీ రాజ్ శాఖల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. అవినీతి అధికారులకు ఈ దాడి గట్టి హెచ్చరికలా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

## కారు డిక్కీలో యువతి మృతదేహం.. వీడిన మిస్టరీ




**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో.. కారులో లభ్యమైన మృతదేహం గోదావరిఖని సెంటినరీ కాలనీకి చెందిన మానసగా గుర్తింపుఘటనా స్థలంలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా.. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులుఆ కారుని అద్దెకు తీసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినోద్‌ని గుర్తించి పట్టుకున్నపోలీస్ అధికారులు.అతడ్ని విచారించగా.. కరీంనగర్‌లోని గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయని.ఫిట్స్ కారణంగా మృతి చెందిందని.. భయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో వదిలి వెళ్లానని తెలిపిన వినోద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లోక్యతండలో కలెక్టర్ ఇంటింటి పర్యటన .. సమస్యలపై తక్షణ చర్యలు

- ప్రతి అర్హుడికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలే లక్ష్యం
- మంచినీరు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- గుడిసెలో నివసిస్తున్న మహిళకు వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- డ్రైనేజీలు, పాఠశాల కాంపౌండ్ వాల్ పనులకు ఆదేశాలు
- ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజా వాయిస్,నల్గొండ.**ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి అర్హుడికి అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. త్రిపురారం మండలం లోక్యతండ గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన ఇంటింటా కాలినడకన తిరుగుతూ ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.రైతు దాస్‌తో మాట్లాడి తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే కందులు వంటి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పింఛన్ రావడం లేదని ఓ వ్యక్తి విన్నవించగా పరిశీలించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 43 పింఛన్లతో పాటు మరో 13 పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మంచినీటి సమస్యపై స్పందించి 40 కుటుంబాలకు నల్లా కనెక్షన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.గుడిసెలో నివసిస్తున్న ధనావత్ కృష్ణకుమారి ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలపగా, వివరాలను పరిశీలించి వెంటనే ఇల్లు మంజూరు చేశారు. గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించాలని, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మంజూరైన రెండు పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.అనంతరం గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో పాఠశాలకు కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, పెయింటింగ్ పనులకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. సోమవారం నుంచి విద్యార్థులకు యూనిఫారాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీవో భవనాల నిర్మాణానికి స్థలాలను సర్వే చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయవద్దని ప్రజలకు సూచించారు. గ్రామ పర్యటనలో ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, సర్పంచ్ జ్యోతి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.





## గత 10 ఏళ్లుగా పాతుకపోయినా ఆ ఇద్దరు అధికారులు

- కలెక్టరేట్లో తిష్ట వేసి పెద్ద ఎత్తున వసూళ్లు
- ఐదుగురు కలెక్టర్లు మారిన వీరు మాత్రం అక్కడే
- ధరణి నుంచి భూభారతి వరకు భూ వివాదాల సొమ్ము చేసుకుంటున్నారు
- యూనియన్ల పేరుతో పెత్తనం
- 22 ఏ ఎన్ ఓ సి, ఫైళ్ళ జాప్యం పై బాధితుల అసంతృప్తి

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఇద్దరు అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదమవుతోంది.ఏండ్లుగా కలెక్టరేట్ లో తిష్ఠ వేసి భూ వివాదాల్లో సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. గత పదేండ్లకు పైగా కలెక్టర్ కార్యాలయం అడ్డగా ఒక సెక్షన్ ( భూ సమస్యలకు సంబంధించి ) నుంచి మరొక సెక్షన్ లోకి మారుతూ భూ వివాదాలను సొమ్ముచేసుకుంటున్నారు. ఇప్పటివరకు ఐదు మంది కలెక్టర్లు మారిన ఈ ఇద్దరికి మాత్రమే ట్రాన్స్ఫర్ కావడం లేదు. ధరణి నుంచి నేటి భూ భారతి వ్యవహారాల వరకు భూ వివాదాల్లో జోక్యం చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూనియన్ల పేరుతో ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు దగ్గరై కలెక్టరేట్ లో పెత్తనం చేస్తూ సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### దశాబ్ద కాలంగా కలెక్టరేట్ లోనే తిష్ఠ

సంగారెడ్డిజిల్లాకు చెందిన ఓ ఇద్దరు రెవెన్యూ అధికారులు పదేండ్లకు పైగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోనే తిష్ఠ వేశారు.

### కలెక్టర్లను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శ :

జిల్లాకు కొత్తగా వచ్చే కలెక్టర్లకు పూర్తి సమాచారం అందకుండా, కొన్ని కీలక ఫైళ్ల విషయంలో తప్పుడు అభిప్రాయాలు కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా ఫైళ్లను ముందుకు నడిపించడం, నచ్చని అంశాలను ఆలస్యం చేయించడం వంటి చర్యల వల్ల పరిపాలనపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో విధులు నిర్వహించిన ఇద్దరు కలెక్టర్లను సైతం పలు అంశాలలో తప్పుదోవ పట్టించినట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతుంది. చివర్లో అధికారులు తేరుకున్నప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందన్న చర్చ సాగుతోంది. జిల్లాలో భూముల రికార్డులు, మ్యుటేషన్లు, సర్వేలు, 22ఏ నిషేధిత జాబితా లాంటి సమస్యలపై పూరి సమాచారంతో బాధితులు దరఖాస్తు చేసుకున్న రెగ్యులరైజ్ కాకపోవడంతో బాధితులకు కలెక్టర్ సమాధానం చెప్పలేకపోతున్నారు.

### ప్రభుత్వ ప్రతిష్ఠకు మసక :

భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే రైతులు, మహిళలు, వృద్ధులు నెలల తరబడి తిరుగుతున్నా పనులు పూర్తి కావడం లేదని కొందరు వాపోతున్నారు. ఈ అధికారుల తీరుతో ఒకే అంశంపై పలుమార్లు దరఖాస్తులు ఇవ్వాల్సి వస్తోందని, ఫైళ్లు ముందుకు కదలడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలతో ప్రభుత్వ పారదర్శక పరిపాలనకు దెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భూ భారతి వంటి కీలక సంస్కరణలపై ప్రజల్లో అనుమానాలు పెరగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు కోరుతున్నారు.లేదంటే ఇలాంటి ఒకరిద్దరి అధికారుల తీరుతో ప్రభుత్వ ప్రతిష్టకు పెద్ద ఎత్తున భంగం వాటిలే అవకాశం ఉందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### ఏండ్లుగా ఒకే శాఖలో..

ఒకే సీటులో తిష్ట వేసిన ఈ అధికారులపై బదిలీ వేటు వేసి గత పదేండ్లుగా ఆ ఇద్దరు అధికారుల అక్రమాల ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నిర్మాణం పూర్తికాకముందే ఇందిరమ్మ ఇంటికి పగుళ్లు


**ప్రజా వాయిస్ వాంకిడి** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండలంలోని పాటాగూడ గ్రామంలో నిరుపేద కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికాకముందే స్లాబ్‌కు పగుళ్లు ఏర్పడి, వర్షం పడితే నీరు కారుతున్నట్లు లబ్ధిదారు సోయం సోంబాయి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆమె, స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇంటిని పరిశీలించిన పంచాయతీ అధికారులు నిర్మాణాన్ని తొలగించి తిరిగి నిర్మించాల్సి ఉంటుందని సూచించినట్లు బాధితురాలు తెలిపారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల పర్యవేక్షణపై కూడా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నాణ్యత లోపాలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. తమపై ఎలాంటి అదనపు భారం పడకుండా నాణ్యమైన ఇంటిని నిర్మించి ఇవ్వాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది.



## పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు
- పరిహారం, పునరావాస ప్రక్రియలను సత్వరం పూర్తి చేయాలి
- పెండింగ్ భూసేకరణకు రూ.2,800 కోట్ల విడుదలకు చర్యలు
- కొత్త ఆయకట్టు సృష్టించేలా భూసేకరణ పనులు పూర్తి చేయాలి



**ప్రజా వాయిస్ మహబూబాబాద్**, జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసం తదితర అంశాలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు .కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ , జిల్లాలో మున్నేరు, పాలేరు, కెనాల్ తదితర నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు.రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ మరియు భూసేకరణ అధికారులు ఎంఏ.ఫిరోజ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జెండా కోసం జంగ్.. ఫిర్యాదులతో ఫైట్

- వర్ధన్నపేటలో హై వోల్టేజ్ వార్అభివృద్ధి పక్కన
- జెండా రాజకీయంతో వేడెక్కుతున్న వర్ధన్నపేట
- అంబేద్కర్ సెంటర్ లో పర్మిషన్ లేకుండా జెండా ఆవిష్కరణపై కేసు
- మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తో పాటు పలువురిపై ఎఫ్ ఐఆర్ నమోదు
- రాజీవ్ గాంధీ జయంతి వేడుకలపై బీఆర్ఎస్ కౌంటర్ పిటిషన్
- ఒకరిపై ఒకరు ఫిర్యాదులతో కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య రాజకీయ రచ్చ

**ప్రజా వాయిస్, వరంగల్ బ్యూరో:** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య జెండా రాజకీయం హై వోల్టేజ్ వార్‌ను తలపిస్తోంది. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఇరు పార్టీలు జెండా కార్యక్రమాలు, రోడ్లపై వేడుకలు, పోలీస్ ఫిర్యాదులతో ఒకరిపై ఒకరు రాజకీయ పోరుకు దిగడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన జాతీయ జెండా ఆవిష్కరణతో మొదలైన వివాదం, రాజీవ్ గాంధీ జయంతి వేడుకల వరకు పాకి ఇప్పుడు పోలీస్ స్టేషన్ ఫిర్యాదుల స్థాయికి చేరింది.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని స్థానిక మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ప్రధాన రోడ్డుపై కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.అయితే స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడితోనే మున్సిపల్ కమిషనర్ ద్వారా ఫిర్యాదు చేయించి, మాజీ ఎమ్మెల్యేతో పాటు సుమారు 25 మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీనికి కౌంటర్‌గా రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రధాన రోడ్డుపై పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగించారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. వాహనదారులకు ఇబ్బందులు కలిగించిన కాంగ్రెస్ నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు.దీంతో “తాము చేస్తే పండగ.. ఎదుటివారు చేస్తే కేసా?” అన్నట్లుగా ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేసుకోవడంతో వర్ధన్నపేటలో కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజా సమస్యలు, పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన నాయకులు జెండా రాజకీయాలు, కేసుల ఫైట్‌లో తలమునకలవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ హై వోల్టేజ్ రాజకీయ వార్ మున్ముందు ఎలాంటి మలుపు తిరుగుతుందోనని వర్ధన్నపేటలో ఆసక్తికర చర్చ సాగుతోంది.



## కోదాడలో ఖాకీలపై మాజీ ఎమ్మెల్యే ఫైర్

- నల్ల బ్యాడ్జీలతో ధర్నా.. పోలీసుల తీరుపై బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర ఆరోపణలు
- దళారుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారంటూ ఆరోపణ
- రూ.18 లక్షలు వసూలు చేసి.. రూ.5 లక్షలే రికవరీ చూపించారా.? అంటూ ప్రశ్న
- గంజాయి కేసుల్లో డబ్బుల వసూళ్ల ఆరోపణలపై విచారణకు డిమాండ్
- కర్ల రాజేష్ మృతి వ్యవహారంలో పోలీసుల వేధింపుల కోణం తేల్చాలని కోరిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే

**ప్రజా వాయిస్,కోదాడ:** కోదాడ పోలీసుల తీరుపై బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం బస్టాండ్ ఎదుట గాంధీ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. టౌన్ సీఐ వ్యవహారశైలిపై ఆరోపణలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో దళారుల వ్యవస్థ పెరిగిపోయిందని విమర్శించారు.బర్రెలు, గొర్ల దొంగతనం కేసులో రూ.18 లక్షలు వసూలు చేశారని, అయితే రూ.5 లక్షలు మాత్రమే రికవరీగా చూపించారని ఆరోపించారు. మిగిలిన రూ.13 లక్షలు ఎక్కడికి వెళ్లాయో తేల్చాలని డిమాండ్ చేశారు. భూ వివాదాలు, కుటుంబ పంచాయతీలు, దొంగతనం కేసుల విషయంలోనూ దళారుల జోక్యం ఉందని పేర్కొన్నారు.గంజాయి కేసుల్లో అరెస్టయిన వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకుని తప్పించారన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల వ్యవహారంలో కర్ల రాజేష్‌ను పోలీసులు వేధించారన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.పోలీసులపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని మల్లయ్య యాదవ్ కోరారు. స్పందన లేకుంటే కోదాడ పోలీస్ స్టేషన్ ఎదుట మరోసారి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

# వైకుంఠ రథాలు ఉన్నాయి..
# - బతికేందుకు అంబులెన్సులు లేవు!

- మనుషుల ప్రాణాల కంటే మరణాలకే ప్రాధాన్యమా?
- మంథనిలో నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక కథనం



**ప్రజా వాయిస్ మంథని** "ముందు వెయ్యి ఉంటే.. వెనుక ఆరు వందలు" అన్నట్లు తయారైంది మంథని మండలంలోని గ్రామాల పరిస్థితి. ఒకవైపు అత్యవసర వైద్యం అందక, సరిపడా అంబులెన్సులు లేక రోగుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారుతుంటే.. మరోవైపు మృతదేహాలను మోసుకెళ్లేందుకు 'వైకుంఠ రథాలను' పంపిణీ చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. బతికున్న మనుషులను రక్షించేందుకు లేని ఆత్రుత, చనిపోయాక ఊరేగించడానికి ఎందుకని ప్రజలు మండిపడుతున్నారు.

### హాస్పిటల్ లో అంబులెన్స్ శూన్యం.. ఆపద వస్తే ప్రాణాలు అరణ్యం!

మంథని ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం వందలాది మంది పేద రోగులు వస్తుంటారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో రోగులను పెద్ద ఆసుపత్రులకు తరలించేందుకు సరిపడా అంబులెన్స్ సౌకర్యం లేదు. ఉన్న ఒకటి అర వాహనాలు కూడా నిరంతరం మరమ్మతులకు గురై మూలనపడటంతో, సరైన సమయానికి వైద్యం అందక అనేక కుటుంబాలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి. నిరుపేదలకు ప్రాణదానం చేసేందుకు అంబులెన్సులు సమకూర్చలేని యంత్రాంగం, వైకుంఠ రథాల పంపిణీకి ప్రాధాన్యమివ్వడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

### కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు!

గత ప్రభుత్వ హయాంలో కమిషన్ల కక్కుర్తితో ప్రణాళిక లేకుండా సూరయ్యపల్లె, మైదిపల్లి వంటి పలు గ్రామాల్లో కోట్ల రూపాయలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించారు. కానీ, అవి గ్రామస్తులకు అందుబాటులో లేని దూర ప్రాంతాల్లో, రోడ్డు సదుపాయం లేని చోట కట్టడంతో ఒక్కటి కూడా వినియోగానికి రావడం లేదు. ఏళ్లు గడుస్తున్నా నీరు, విద్యుత్ వసతులు కల్పించకపోవడంతో ఆ భవనాలు పిచ్చిచెట్లతో నిండి ముళ్లపొదలుగా మారాయి. నేటికీ గ్రామంలో ఎవరైనా చనిపోతే పొలాల్లోనో, చెరువు గట్లపైనో అంతిమ సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

### రథాలు ఇచ్చారు సరిపోతుందా?

ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు చొరవతో కొన్ని గ్రామాలకు వైకుంఠ రథాలను అందించడం జరిగింది. గ్రామాల్లో స్థానికంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటికలు పనిచేయకపోవడంతో, మృతదేహాలను నేరుగా మంథని గోదావరి తీరానికి తరలించడానికే ఈ రథాలను కేటాయించారనే చర్చ నడుస్తోంది. కానీ "వైకుంఠధామాలే దిక్కులేని చోట, ఈ రథాలు దేనికి సంకేతం?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రాధాన్యతలు మార్చకపోతే పోరాటమే!

ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం ఆర్భాటపు కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రాధాన్యతలను గుర్తించాలని మంథని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముందుగా ప్రభుత్వ హాస్పిటల్‌కు సరిపడా అంబులెన్స్ సౌకర్యం కల్పించి బతికున్న వారి ప్రాణాలు కాపాడాలని, అలాగే వృథాగా ఉన్న వైకుంఠధామాలకు మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## వ్యవసాయానికి యాంత్రీకరణ'రక్షణ కవచం'

- కూరగాయలు,పండ్ల తోటలకూ డ్రోన్లు, రోబోటిక్స్ టెక్నాలజీ
- ఉద్యాన సాగులో కూలీల కొరతకు యంత్రాలే చెక్
- పరిశోధనా స్థానంలో ఆధునిక పరికరాల ప్రదర్శనసద్వినియోగం చేసుకోవాలన్న వీసీ డి.రాజి రెడ్డి

**ప్రజా వాయిస్: రాజేంద్రనగర్:** రాష్ట్రంలో సాంప్రదాయ సాగు స్థానంలోకి ఆధునిక యంత్రాల వినియోగం అనివార్యంగా మారుతోంది. పెరిగిన కూలీల ఖర్చులు, సకాలంలో పనివారు దొరక్క అడుగడుగునా ఎదురవుతున్న సమస్యలకు తోడు వాతావరణ మార్పులతో ఉద్యాన రైతులు నష్టపోకుండా ఉండేందుకు 'యాంత్రీకరణ'ఒక్కటే మార్గమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధనా కేంద్రంలో నిర్వహించిన పరికరాల ప్రదర్శన కార్యక్రమంలో శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ డి.రాజి రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సాంకేతికత ఆధారిత సాగుతోనే రైతులకు ఆర్థిక పరిపుష్టిసాధ్యమవుతుందన్నారు.

### కూలీల సమస్యకు శాశ్వత పరిష్కారం

ఇంతకాలం ధాన్యం సాగుకే పరిమితమైన యంత్రాలు, ఇప్పుడు కూరగాయలు, పండ్ల తోటల సాగులోకి వేగంగా అందుబాటులోకి వచ్చాయి.నాట్లు వేసే క్రమంలో సమయం వృథా కాకుండా ప్లాంటర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లు ఉపయోగపడతాయని, కలుపు తీసేందుకు పవర్ టూల్స్ వినియోగించడం వల్ల రసాయనాల వాడకాన్ని తగ్గించవచ్చని స్పష్టమవుతోంది.

### స్మార్ట్ సాగుతో నష్ట నివారణ'రసాయనాల ఆదా

ప్రెసిషన్ స్ప్రేయర్లు,డ్రోన్ల ద్వారా అవసరమైన ప్రాంతంలోనే పురుగుమందులు చల్లడం వల్ల వృథా తగ్గి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.స్మార్ట్ సెన్సార్లు,డ్రోన్ల సాయంతో నేల సారం, తెగుళ్ల తీవ్రతను ముందే గుర్తించి తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు.

### యువత నేర్చుకోవాలి

విద్యార్థులు,యువ రైతులు ఈ మెళకువలను నేర్చుకుని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రాజి రెడ్డి పేర్కొన్నారు."ఎక్స్ మెషిన్' కంపెనీ ప్రతినిధి త్రివిక్రమ్ స్వయంగా రోబోటిక్ మెషినరీ పనితీరును ప్రాక్టికల్‌గా ప్రదర్శించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్,వి.మురళి,డాక్టర్ పిడిగం సైదయ్య,డాక్టర్ నిఖిల్ తదితర శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

## ఏఎంఆర్‌పీ నీటితో ముందుగా స్థానిక చెరువులు, కుంటలు నింపాలి

- రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం
- సాగర్ నిండే వరకు పోతిరెడ్డిపాడు నీటి తరలింపు ఆపాలి
- గుడిపల్లి, పీఏపల్లి చెరువులు నింపి భూగర్భ జలాలు పెంచాలి
- తెలంగాణ ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరిస్తోంది
- ఏఎంఆర్‌పీ డిస్ట్రిబ్యూటర్ గేట్ల వద్ద మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ధర్నా

**పెద్దఅడిశర్లపల్లి,ప్రజా వాయిస్.** నీటి విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం పీఏపల్లి మండలం గణపురం స్టేజ్ సమీపంలోని ఏఎంఆర్‌పీ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ మెయిన్ గేట్ల వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, నాగార్జునసాగర్‌కు చుక్క నీరు రాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా భారీగా నీటిని తరలించడం ఏమిటని ప్రశ్నించారు. సాగర్ నిండే వరకు పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణా నదికి సమృద్ధిగా నీరు వస్తున్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని గుర్తుచేశారు. ఏఎంఆర్‌పీ రిజర్వాయర్ నీటిని ముందుగా గుడిపల్లి, పీఏపల్లి మండలాల్లోని స్థానిక చెరువులు, కుంటలకు అందించి నింపాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని, రైతులతో పాటు ప్రజలు, పశువులు కూడా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండకు తాగునీరు తరలిస్తూనే స్థానిక రైతాంగం, ప్రజల అవసరాలను విస్మరించకూడదన్నారు. చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించిన ఆయన, తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకుని సాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సాగునీరు అందించడంతో పాటు ఏఎంఆర్‌పీ నీటితో గుడిపల్లి, పీఏపల్లి మండలాల్లోని చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతావత్ బిల్యా నాయక్, వెల్లుగురి వల్లపు రెడ్డి, కటికనేని మాధవరావు, తోటకూరి పరమేష్, మద సుధాకర్ గౌడ్, పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## ఖమ్మం గడ్డపై జర్నలిస్టుల గర్జన!

- మాట నిలబెట్టుకోండి.. ఇళ్ల స్థలాలివ్వండి!
- హక్కుల సాధనకే పాత్రికేయుల రణభేరి!
- షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో గళమెత్తిన పాత్రికేయులు

**ప్రజా వాయిస్ ఖమ్మం:** తమ చిరకాల ఆకాంక్ష అయిన సొంతింటి స్థలం సాధన కోసం ఖమ్మం జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు సమర శంఖం పూరించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్–హెచ్ 2843) జిల్లా కమిటీ పిలుపు మేరకు ఈ నెల 22 నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు యూనియన్ నియోజకవర్గ నాయకులు ఎన్డీ కర్ణ ప్రకటించారు. శుక్రవారం నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాత్ర కార్యాచరణను వివరించారు.అమరవీరుడి గడ్డపై ఉద్యమ శంఖారావంనిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అమర జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వర్ధంతి రోజే ఈ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సుమారు 15 రోజుల పాటు సాగే ఈ యాత్రలో భాగంగా ప్రతీ మండల కేంద్రంలోనూ తహశీల్దార్లను కలిసి సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రాలు అందజేయనున్నారు.కేవలం తమ న్యాయమైన హక్కును ప్రభుత్వానికి గుర్తుచేసే శాంతియుత ఉద్యమమని నేతలు స్పష్టం చేశారు. ఈ పోరాటానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని, జిల్లాలోని జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పాత్రికేయులు మోర సైదులు, రామదాసు, శివాజీ, దుడ్డెల సంజయ్, పంబ రవి తదితరులు పాల్గొన్నారు.



## ఫిట్నెస్ లేని స్కూల్ బస్ ల తో పిల్లల భద్రత కు బాధ్యులు ఎవరు?

- ఫిట్నెస్ లేని బస్సులు తొర్రూరు రోడ్ల పై పరుగులు
- పిల్లల తో ఉన్న బస్ రథ చక్రం ఊడి పోవడం
- పిల్లల కు తప్పిన పెను ప్రమాదం
- నిద్ర పోతున్న ఆర్ టి ఏ , విద్యా శాఖ అధికారులు.
- పిల్లల రక్షణ ఎవరి బాధ్యత



**తొర్రూర్ ప్రజా వాయిస్...** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని కంటాయపాలెం రోడ్డులో గల సెంట్ సావియో పాఠశాలకు చెందిన ప్రైవేట్ బస్సు 30 మంది పిల్లలతో శుక్రవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో అన్నారం రోడ్డులో వెళ్తుండగా బస్సు వెనక టైర్ ఊడిపోవడంతో బస్సులో ఉన్న 30 మంది పిల్లలు భయభ్రాంతులకు గురైభయానక,వాతావరణంలో సృష్టించింది. ఏమీ తెలియని వయసులో ఉన్న పది సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణం ఏర్పడినది. పిల్లలకు ఏమీ కాకపోవడంతో ఒక్కసారిగా తొర్రూర్ మున్సిపల్ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు టైర్ ఊడి పోయే వరకు చూసుకోలేని డ్రైవర్ను పెట్టుకొని నడిపిస్తున్న స్కూల్ యాజమాన్యాము పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్న ఆర్టిఏ అధికారులు కానీ విద్యాశాఖ అధికారులు కానీ చర్యలు ఏమాత్రం తీసుకోకపోవడం చర్చనీయాంశం

తొర్రూర్ మున్సిపల్ పరిధిలో ఆర్యభట్ట, నలంద, లిటిల్ ఫ్లవర్, అభయాస్, సెయింట్ సావియో, పి ఎస్ ఆర్, సిద్ధార్థ, మొదలగు పాఠశాలల బస్సులతో తొర్రూర్ వరంగల్ హైవే రోడ్డు లింక్ రోడ్లు ఉదయం సాయంత్రం పిల్లలతో కిటకిటలాడుతూ ఆర్టీసీ బస్సులు, లారీ, టూవీలర్స్ నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే రోడ్లలో ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతుంటే ఆర్టిఏ అధికారులు గానీ మండల విద్యాశాఖ అధికారి గాని, జిల్లా విద్యాశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పాఠశాలలపై తర్చు ఏదో ఒక సమస్యలు ఉన్నాయని పత్రిక ముఖంగా సమస్యలు తెలిపిన పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విద్యాశాఖ అధికారుల వల్ల ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నాయని నమ్మకం ప్రజలకు కలుగుతున్న ది. ఇప్పటికైనా పాఠశాలలపై స్కూల్ డ్రెస్సులు నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు టై లు పాఠశాల యాజమాన్యం వారే అమ్ముతున్నారనే సమాచారాన్ని విద్యార్థి సంఘాలు , విలేకరులు పత్రికా ముఖంగా ఎన్నిసార్లు తెలిపిన పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం ఆ శాఖ అధికారులకు పాఠశాల యాజమాన్యాల మధ్య లావాదేవీలు ఏమన్నా నడుస్తున్నాయా అనే కోణంలో జిల్లా రాష్ట్ర అధికారులు కానీ విద్యాశాఖ మంత్రి సి యం రేవంత్ రెడ్డి గాని నిష్పక్షపాత చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

# అదనపు కలెక్టర్ మహేందర్ జీకి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి : బాదం ప్రవీణ్.**

**జిల్లా అభివృద్ధిలో మహేందర్ జీ సేవలు అభినందనీయం: రైస్ మిల్లర్స్ ప్రతినిధులు**



ప్రజా వాయిస్ ములుగు జిల్లా
ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ జన్మదినాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మహేందర్జీని అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ..జిల్లా పరిపాలనలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న అదనపు కలెక్టర్ మహేందర్ జీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహేందర్ జీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ములుగు జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి మరింత ఫలప్రదం కావాలని, రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని బాదం ప్రవీణ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మహేందర్ జీకి సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలని, ఆయన సేవా ప్రస్థానం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సరఫరాల జిల్లా అధికారి పైసల్ హుస్సేన్, జిల్లా మేనేజర్ కృష్ణవేణి నాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర్ రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, నిర్వహణ కార్యదర్శి కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు రగోతం, సుదర్శన్ రెడ్డి, గౌరవ సలహాదారులు శ్రవణ్, అనిల్, సహాయ కార్యదర్శి భద్రయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై దాడులు ఆపాలి

**ఉపాధ్యాయులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిరసన**

**తహసిల్దార్ కు వినతిపత్రంఇచ్చిన ఉపాధ్యాయులు**



ప్రజా వాయిస్.. వనపర్తి
ఉపాధ్యాయులను బానిసలుగా చూస్తూ, వారి హక్కులు మరియు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న ఘటనలకు నిరసనగా శుక్రవారం చిన్నంబావిలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులపై జరుగుతున్న అన్యాయాలను ఖండిస్తూ చిన్నంబావిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం (మెమోరాండం) సమర్పించారు. ఉపాధ్యాయులపై అన్యాయంగా వ్యవహరించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల గౌరవం, హక్కులను కాపాడే విధంగా చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఉపాధ్యా యులు కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద హైస్కూల్, చిన్నంబావి ప్రిన్సిపాల్ శ్రీ టీ. లింగస్వామి పాల్గొని ఉపాధ్యాయుల హక్కులు, గౌరవం మరియు భద్రతను పరిరక్షించాల్సిన అవసరాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడు. అలాంటి ఉపాధ్యాయులను బానిసలుగా చూడటం సమాజ ప్రగతికి విరుద్ధం. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం మరియు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి" అని ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## 16 ప్యాకేజీ, భీమ 27, 28 డిస్ట్రిబ్యూషన్ నుంచి

# కాలువలకు సాగునీరు అందించాలి

**ఐదు రోజులలో రైతులకు భీమా నుండి సాగునీరు అందించాలి**

**రైతులకు సాగునీరు ఇవ్వకపోతే రైతుల పక్షాన బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమలు నిర్వహిస్తాశీ**

ప్రజా వాయిస్.. వనపర్తి
వర్షాకాలం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి జూపల్లి కృష్ణారావు చెరువులకు, కుంటలకు, పంటలకు, నీళ్లు అందిస్తామని చెప్పి రైతులకు నీళ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బిజెపి మండల నాయకులు ఆవుల నారాయణ అన్నారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ జూరాలకు నీరు వచ్చి రెండు నెలలు గడుస్తున్న బీమా 16 ప్యాకేజీ, బీమా 27, 28 డిస్ట్రిబ్యూషన్ నుంచి కాలువలకు సాగునీరు అందించడం లేదు మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఎలాంటి పంటలు వేయడానికి అటు వర్షం



లేక ఇటు కాలువకు నీళ్లు రాక పంటలు వేయలేని పరిస్థితి ఉంది అని ఆయన అన్నారు. రైతులు భార్య పిల్లలను పోషించడం ఎలా పంటలు వేయకపోతే అప్పుల ఊబిలో కురుకుపోతారు మంత్రి సొంత మండలానికి గోపాల్ దీన్నే జూరాల రిజర్వాయర్, మరియు చిన్నమారు ఎత్తిపోతల ద్వారా చిన్నంబాయి మండలానికి చెరువులకు, కుంటలకు, నీళ్లు నింపిఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తున్నారు పక్కన ఉన్న వీపనగండ్ల మండల రైతులు కనిపించడం లేదా? అని బిజెపి మండల అధ్యక్షుడు నారాయణ ప్రశ్నించారు. ఐదు రోజుల్లో ఇక్కడి రైతులకు సాగునీరు అందించకుంటే రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎల్లేని సుధాకర్ రావు తో కలిసి రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామని చెప్పి ప్రస్తుతం 12 గంటలుఇస్తూ వాటిలో ఎల్ సి అంటూ కోతలు పెడుతున్నారు. రైతులకు కనీసం 18 గంటలైన కరెంటు ఇవ్వాలి అని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రాకేష్ యాదవ్, జిల్లా కౌన్సిల్ నెంబర్ ా. నరేష్ ప్రధాన కార్యదర్శులు శివ యాదవ్, విష్ణు, రైతులు పాల్గొన్నారు

# ఢిల్లీకి చేరిన వనపర్తి కాంగ్రెస్ పంచాయతీ

**అధిష్ఠానానికి చిన్నారెడ్డిపై మేఘారెడ్డి ఫిర్యాదు**

**అధిష్టానం ఎవరికి మేలు చేస్తుందో వేచి చూడాలి**



ప్రజా వాయిస్.. వనపర్తి
వనపర్తి కాంగ్రెస్ లో రగులుతున్న వర్గపోరు చివరకు ఢిల్లీకి చేరింది. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తన అనుచరులతో కలిసి ఢిల్లీకి చేరుకున్నారు. ఖర్గే, వేణుగోపాల్ ను కలవనున్న మేఘారెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ను కలిసి సీనియర్ నేత చిన్నారెడ్డిపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, నియోజకవర్గంలో పార్టీకి నష్టం కలిగేలా ప్రవర్తిస్తున్నారని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చిన్నారెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా పరిస్థితి సద్దుమణగకపోవడంతో ఎమ్మెల్యే నేరుగా ఢిల్లీ బాట పట్టారు. ఈ పరిణామంతో వనపర్తి కాంగ్రెస్ రాజకీయం వేడెక్కింది

# తీర్యానిలో ఐటీడీఏ పీవో మంద మకరందు విస్తృత పర్యటన

**ఉపాధ్యాయునిగా మారి 20 నిమిషాలపాటు విద్యార్థులకు పాఠాలు చెప్పిన ప్రాజెక్టు అధికారి**

**విద్య, గ్రామీణ సమస్యలపై సమీక్ష**



ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండలంలోని పలు గ్రామాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు పర్యటించి విద్య, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ అంశాలను పరిశీలించారు. పంగిడి మాదొర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. తాగునీరు, వంటగది సదుపాయాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పంగిడి మాదొర రైతు వేదికలో సర్పంచులు ఆత్రం రాధాబాయి, తుంరం గోపాల్ నిర్వహించిన గ్రామసభలో పాల్గొని, వర్షాకాలం జాగ్రత్తలు, పారిశుధ్యం, తాగునీరు, ప్రజారోగ్య అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామస్తుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పీవీటీజీ గ్రామం దంతన్‌పల్లిలో ఆశ్రమ పాఠశాల భవనం, స్థల పరిస్థితులను పరిశీలించి, పాఠశాల పునఃప్రారంభానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపు, గ్రామీణాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్, ఏటీడీఓ చిరంజీవి, పాఠశాల సిబ్బంది, మాజీ మండల అధ్యక్షులు ఆత్రం లక్ష్మణ్, గ్రామ పటేల్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలి, ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా,వేగవంతంగా పూర్తి చేయాలి

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటీల్**

ప్రజా వాయిస్ తెలకపల్లి ఆగస్టు21
అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ఓటరు జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటీల్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని 197, 201 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 నాటి ఓటరు జాబితాను ప్రస్తుత ఓటరు జాబితాతో అనుసంధానం చేసే క్రమంలో గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. 197వ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు ఎం.డి. అక్బర్ పాషా కు నోటీసు జారీ చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. 2002 నాటి ఓటరు జాబితాలో నమోదైన పేరుకు, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో నమోదైన పేరుకు సరిపోలిక లేకపోవడంతో సంబంధిత ఓటరును అనామలీస్ జాబితాలో గుర్తించి నోటీసు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నోటీసుల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరుకు సరైన సమాచారం అందేలా, సంబంధిత వ్యక్తికి నోటీసు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు తన అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు నోటీసులు జారీ చేసినప్పుడు, సంబంధిత ఓటర్లు ప్రభుత్వం జారీ చేసిన, ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల అధికారిక ధ్రువపత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలని సూచించారు. ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఆధారాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిన అనంతరం సంబంధిత వివరాలను భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ధ్రువపత్రాలు స్వీకరించిన అనంతరం వాటి పరిశీలన, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, తదుపరి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలకపల్లి మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 2002 నాటి ఓటరు జాబితా ఆధారంగా ఇప్పటికే గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించి జనరేట్ చేసిన దరఖాస్తులు, నోటీసులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎవరైనా ఓటరు అందుబాటులో లేకపోతే, వారికి సమాచారం చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందా లేదా, ఓటర్లు తమ ఆధారాలను సమర్పించారా లేదా, సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారా లేదా అనే అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి పేరును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నప్పటికీ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అదే సమయంలో అర్హత లేని లేదా అనుమానాస్పదంగా ఉన్న నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత ఓటర్లకు తమ వివరణ, ఆధారాలు సమర్పించుకునే అవకాశం కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలన పూర్తయిన వెంటనే అర్హత కలిగిన ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. బీఎల్‌వోలు, బి ఎల్ ఏ లు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చెయ్యాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు సంబంధించిన



వివరాలు నమోదు చేస్తున్న కలెక్టర్

ఆధారాలను సమర్పించి ప్రక్రియలో సహకరించేలా వారికి వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, జాబితా సవరణలో ఖచ్చితత్వం, పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలకపల్లి మండల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 ఓటర్ జాబితా ప్రకారం మ్యాపింగ్ కానీ వారు 582 మంది, అనాలిసిస్ జాబితా ప్రకారం 6974 మందిని గుర్తించడం జరిగిందని 7566 మందికి నోటీసులు జనరేటర్ చేసి వారందరికీ నోటీసులను అందజేస్తున్నట్లు తాహసిల్దార్ కలెక్టర్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట తెలకపల్లి తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా స్వయంగా పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణా రావు

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యం:మంత్రి జూపల్లి కృష్ణారావు**



ప్రజా వాయిస్.. వనపర్తి

పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.అదేవిధంగా, ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ వేసుకునే స్థితిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.అలాగే, ఇల్లు నిర్మాణంలో బేస్ లెవెల్ వరకు పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగతా నిర్మాణాన్ని కొనసాగించలేకపోతున్న అర్హులైన లబ్ధిదారులకు రూ.4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతున్నామని వెల్లడించారు.అర్హత, ఇంటి ప్రస్తుత స్థితిగతులు మరియు లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్ గౌడ్, హౌసింగ్ డీఈ రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల పట్టా భూములను 22-ఏ నుంచి తొలగించాలి

**- కలెక్టర్ కార్యాలయంలో బిజెపి నాయకుల వినతిపత్రం**



ప్రజావాయిస్/ వికారాబాద్:

వికారాబాద్: 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన పేదల పట్టా భూములను జాబితా నుంచి తొలగించి, అర్హులైన రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని కోరుతూ వికారాబాద్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యు.రమేష్ కుమార్ మాట్లాడుతూ...రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. పేదల పట్టా భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అర్హులైన రైతుల భూములను పరిశీలించి 22-ఏ జాబితా నుంచి తొలగించి, వారికి పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, మాజీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

ప్రజా వాయిస్ హన్మకొండ / కాజీపేట

మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శుక్రవారం సందర్శించారు. శిక్షణ కేంద్రాన్ని చేరుకున్న పోలీస్ కమిషనర్ కు శిక్షణా కేంద్రం పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు వివిధ అంశాలపై శిక్షణకై వచ్చే పోలీస్ అధికారులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించి.. ఈ కేంద్రం విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్ స్పెక్టర్ రవికుమార్, ఆర్. ఐ సింహచలం శ్రీనివాస్, ఆర్. ఎస్. ఐ రవి తేజ తో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మరణించి జీవిద్దాం.. మానవత్వంతో అమరత్వం

**నేత్రదానంతో మరో ఇద్దరికి చూపునిద్దాం..**

**పార్థివదేహ దానంతో భావిభారత వైద్యులకు గురువులుగా నిలుద్దాం**

**తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ల**




ప్రజా వాయిస్ ములుగు జిల్లా; ఆగస్టు 21:

"మానవత్వంతో అమరత్వం.. మరణానంతరం కూడా జీవిద్దాం. నేత్రదానంతో మరో ఇద్దరికి చూపునిద్దాం.. పార్థివదేహ దానంతో భావిభారత వైద్యులకు గురువులుగా నిలుద్దాం" అని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో సామాజిక ఉద్యమాల దళపతి ముంజాల బిక్షపతి అధ్యక్షతన అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ.. అవయవదానం ద్వారా ఆరిపోతున్న జీవితాలకు వెలుగునివ్వవచ్చని అన్నారు. మనిషి మరణించిన అనంతరం కూడా తన అవయవాల ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**"చనిపోయిన తర్వాత కూడా చిరంజీవులుగా జీవిద్దాం"**

మరణం ప్రతి ఒక్కరికీ సహజమేనని, అయితే మరణానంతరం మన అవయవాలు మరొకరి జీవితానికి ఉపయోగపడేలా చేయడం గొప్ప మానవతా కార్యమని డాక్టర్ అశోక్ అన్నారు. ప్రతి మనిషి మరణించిన తర్వాత పార్థివదేహాన్ని కాల్చి బూడిద చేయడం లేదా మట్టిలో కలిపేయడం కంటే నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపునివ్వాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వైద్య విద్యకు పార్థివదేహాలను దానం చేయడం ద్వారా భావిభారత వైద్యులకు ప్రత్యక్షంగా గురువులుగా నిలిచే అవకాశం లభిస్తుందని తెలిపారు. అవయవదానం, నేత్రదానం, పార్థివదేహ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**"మరణానంతర జీవమే నిజమైన మానవత్వం"**

సామాజిక ఉద్యమాల దళపతి ముంజాల బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవయవదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు అవయవదాన ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కె. నరసయ్య, అవయవదాతల సంఘం వికారాబాద్ జిల్లా నాయకులు ఎం. గోపాల్ రెడ్డి, కుమ్మరి వెంకట్, స్థానికులు బానోతు గోవింద్, ఆలరామయ్య, కోటి తిరుపయ్య, మండేపూడి కృష్ణయ్య, గిరి, తిరుమలయ్య, సహజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వాడలో జోరుగా అక్రమ నీటి ధందా

**- ట్యాంకర్ల ద్వారా విచ్చలవిడిగా నీటి తరలింపు**
**- భూగర్భ జలాలపై ముప్పు**
**- రాత్రింబవళ్లు సాగుతున్న నీటి సరఫరా**
**- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు**
**- అక్రమ నీటి తరలింపు అడ్డుకోవాలని స్థానికుల డిమాండ్**





ప్రజావాయిస్ పటాన్ చెరువు:

పారిశ్రామిక ప్రాంతమైన పటాన్చెరు నియోజకవర్గంలోని పలు పారిశ్రామికవాడలో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ పారిశ్రామిక ప్రాంతంలో వేల సంఖ్యలో లక్షల లీటర్ల నీటిని నింపి వాటి ద్వారా పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లోని నివాసాలలోని నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న బస్తీలలో చిన్నచిన్న ట్యాంకర్ల ద్వారా అమ్మకాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అక్రమ నీటి వ్యాపారం దర్జాగా జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు బడా వ్యాపారవేత్తలు మాత్రం తమకు ప్రజా అవసరాలు అవసరం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారని వీరు నిర్వహిస్తున్న దందాపై చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడిగే వారు చర్యలు తీసుకునే వారు లేకపోవడంతో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.పటాన్చెరువు నియోజకవర్గంలో ని పారిశ్రామిక ప్రాంతాలైన పాషా మైలారం, ఇస్నాపూర్, చిట్కుల్,బొల్లారం, కాజిపల్లి,బొంతపల్లి, గుమ్మడిదల, గడ్డపోతారం, అల్లినగర్ తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా విరివిగా ఆక్రమణకు పాల్పడుతున్న గాని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అంతే కాకుండా పగలు రాత్రి అనే తేడా లేకుండా దర్జాగా ట్యాంకర్ల ద్వారా గ్రామాల నుంచి విరివిగా పారిశ్రామిక వాడలకు అక్రమ నీటి దందా నిర్వహిస్తున్న పట్టించుకునే నాధుడే కరువాయాడని ప్రజలు వాపోతున్నారు అక్రమంగా కొనసాగుతున్న అక్రమ నీటి దందాపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ నీటి వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలి

**- కమిషనర్ ను కోరిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు**



ప్రజావాయిస్ జిన్నారం :

జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ప్రజలకు ఇబ్బంది కలిగే చోట ట్రాన్స్ ఫర్మార్ ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా ఉంటుందని, ప్రజలకు,పశువులకు, ఎలాంటి ఇబ్బంది లేని చోట 11 కెవి ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేసేలా చూడాలని కమిషనర్ నరేందర్ రెడ్డి ని కోరిన బిఆర్ఎస్ నాయకులు. ప్రజలు ఏమాత్రం దూర దృష్టి లేకుండా ప్రజలకు ఇబ్బంది కలిగే చోట విద్యుత్ శాఖ అధికారులు చాయి దుకాణం పక్కనే 11 కెవి ట్రాన్స్ఫారం గద్దెను ఏర్పాటు చేయడం సరైన నిర్ణయం కాదని ఎవరికి ఇబ్బంది లేని చోట ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని బిఆర్ఎస్ నాయకులు కోరారు. కమిషనర్ కు సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు. ట్రాన్స్ఫారం ఏర్పాటు కోసం స్థలం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి చూపించారని విద్యుత్ శాఖ అధికారులు తెలపడంతో ప్రజాప్రతినిధీ ప్రజలకు ఇబ్బందిగా కలిగే చోట ఎలా ట్రాన్స్ఫారం కోసం స్థలం చూపిస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యుత్ సమస్య ఎక్కడుందో ముందుగా పరిశీలించి ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నాయకులు విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంద రమేష్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,నాగరాజు యాదవ్, శ్రీధర్ గౌడ్, మల్లేష్ యాదవ్, బ్రహ్మేంద్ర గౌడ్, మల్లేష్, నిఖిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం**
**- జోగన్‌పల్లిలో ఘనంగా పంపిణీ చేసిన ఏలేటి మహిపాల్ రెడ్డి**




ప్రజా వాయిస్, కోరుట్ల:

పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి అన్నారు. కోరుట్ల మండలం జోగన్‌పల్లి గ్రామంలో శుక్రవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి హామీలను ఇప్పటికే నెరవేర్చామని ఆయన గుర్తు చేశారు. అలాగే రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, కళ్యాణమస్తు/షాదీ ముబారక్ వంటి పథకాలు నిరుపేదలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని అన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డు కేవలం సరుకుల కోసమే కాకుండా, ప్రభుత్వ పథకాలకు ప్రామాణిక పత్రంగా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ "ప్రజా ప్రభుత్వం - సంక్షేమమే లక్ష్యం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఎల్పుల అంబేద్కర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రాల హరీష్, గ్రామ శాఖ అధ్యక్షులు బిట్కు సహదేవ్, పార్టీ నాయకులు బద్దం నారాయణ, బద్దం గౌతం రెడ్డి, ఏలేటి గోపాల్ రెడ్డి, ఇంద్రాల అశోక్, మురళీధర్ రెడ్డి, బూర్గుల శ్రీహరి, పోతవేని శేఖర్, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికల భద్రతపై అవగాహనతో పాటు సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరం

**తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో .షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**




**ప్రజా వాయిస్,మహబూబాబాద్**
పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో బాలికల భద్రత, సైబర్ నేరాల నివారణ, మానవ అక్రమ రవాణా, భరోసా కేంద్రం సేవలు మరియు మహిళా భద్రతపై షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని షీ టీం ఎస్ఐ సునంద మరియు సైబర్ క్రైమ్ ఎస్ఐ కరుణాకర్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, సైబర్ క్రైమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

**.షీ టీం సేవలు – బాలికలకు భద్రతపై అవగాహన**
షీ–టీం ఎస్ఐ సునంద షీ టీం విధులు, బాధ్యతలు, షీ టీంను ఏ విధంగా సంప్రదించాలి, షీ టీం సిబ్బంది నిర్వహించే విధులు, మహిళలు మరియు బాలికల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించి, గోప్యతతో ఎలా పరిష్కరిస్తారనే అంశాలను వివరించారు. అలాగే పోక్సో యాక్ట్ ప్రాముఖ్యత, బాలికల రక్షణకు చట్టపరమైన భద్రత, టి – సేఫ్ అప్ వినియోగం గురించి అవగాహన కల్పించారు.విద్యార్థినులు తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో, శ్రద్ధగా చదువుకోవాలని, తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సునంద సూచించారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం**
సైబర్ క్రైమ్ ఎస్ఐ కరుణాకర్ వివిధ రకాల సైబర్ నేరాల గురించి విద్యార్థినులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, సందేశాలు, ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లు వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని, సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**.భరోసా కేంద్రం సేవలపై అవగాహన**
భరోసా కేంద్రం సిబ్బంది భరోసా కేంద్రం అందించే సేవలు, విధులు మరియు బాధ్యతల గురించి విద్యార్థినులకు వివరించారు. మహిళలు, బాలికలు ఏవైనా వేధింపులు, హింస లేదా ఇతర సమస్యలకు గురైనప్పుడు భరోసా కేంద్రం ద్వారా పొందగల సహాయం, కౌన్సెలింగ్ మరియు ఇతర సేవల గురించి అవగాహన కల్పించారు.

**.మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి**
యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది మానవ అక్రమ రవాణా అంటే ఏమిటి, అది ఏ విధంగా జరుగుతుంది, అక్రమ రవాణాకు గురయ్యే పరిస్థితులు ఏమిటి, దాని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు..బాలికలు చట్టాలపై అవగాహన కలిగి, సైబర్ నేరాలు, ఇతర ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమ భద్రతతో పాటు సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.

**ముఖ్యమైన హెల్ప్ లైన్ నెంబర్లు:**
అత్యవసర సహాయం: 112 ,
మహబూబాబాద్ షీ టీం నెంబర్: 8712656935 ,
సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్: 1930 ,చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్: 1098మహిళ హెల్ప్ లైన్ నెంబర్: 181 ,

**600 మంది విద్యార్థినులకు అవగాహన**
ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి మేడం, అధ్యాపక సిబ్బంది,సుమారు 600 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది రమేష్, పార్వతి, సుధారాణి, ప్రియాంక, ఎ హెచ్ టి యూ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ నాయక్, అరుణ, భరోసా సిబ్బంది మౌనిక, బేబీ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయానికి వచ్చి పోలీసులకు చిక్కిన వ్యక్తి..2 కిలోల గంజాయి స్వాధీనం

**కోటమైసమ్మగుడి వద్ద నిందితుడి అరెస్టు. మరో నిందితుడి కోసం గాలింపు. వివరాలు వెల్లడించిన సీఐ.ఎస్. రాఘవరావు,ఎస్ఐ డి. విజయ్‌కుమార్**

**ప్రజా వాయిస్,నిడమనూరు.**
నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలోని కోటమైసమ్మగుడి సమీపంలో గంజాయి విక్రయానికి వచ్చిన వ్యక్తిని పట్టుకుని, అతని వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు హాలియా సీఐ ఎస్. రాఘవరావు, నిడమనూరు ఎస్ఐ డి. విజయ్‌కుమార్ వివరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిఘా ఏర్పాటు చేసి నిందితుడు జటావత్ వినోద్ (29)ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.కొండమల్లేపల్లి మండలం జటావత్ తండా హెచ్/ఓ రమావత్ తండాకు చెందిన వినోద్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతని వద్ద నుంచి సుమారు రూ.50




వేల విలువైన 2,000 గ్రాముల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణలో వినోద్ గతంలో పలు బైక్, సెల్‌ఫోన్ చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడైందన్నారు.పీఏపల్లి మండలం యద్రగట్టు తండాకు చెందిన రమావత్ మహేష్‌తో కలిసి తుర్కయంజాల్--హైదరాబాద్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి, కోటమైసమ్మగుడి సమీపంలో విక్రయించేందుకు వచ్చినట్లు విచారణలో తెలిసిందని సీఐ, ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు రమావత్ మహేష్ పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా చర్యలు చేపట్టామని తెలిపారు. సీఐ ఎస్. రాఘవరావు పర్యవేక్షణలో, ఎస్ఐ డి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, క్లూస్ టీం సభ్యులు సమిష్టిగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. అరెస్టయిన నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# సమన్వయంతో పనిచేస్తేనే గణేష్ ఉత్సవాలు విజయవంతం

**అధికారులతో సమీక్షించిన శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ**
**పోలీస్,జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు**

**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:**అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం విజయవంతమవుతాయని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ స్పష్టం చేశారు.రాబోయే గణేష్ చతుర్థి వేడుకలను ప్రశాంతంగా,సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు శంషాబాద్ జోన్, జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని సంబంధిత శాఖల అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆమె ప్రత్యేక




సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ చంద్రకళ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో అధికారులు ముందస్తు తనిఖీలు చేపట్టి ఏర్పాట్లన్నింటినీ సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఊరేగింపు మార్గాల్లో రహదారుల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వేలాడుతున్న వైర్లు, స్తంభాలను తనిఖీ చేసి సరిచేయాలని,నిమజ్జన ప్రాంతాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.భాగ్యనగర్ ఉత్సవ సమితి,బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ,భక్తులు,ఉత్సవ నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వ శాఖలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో శంషాబాద్ డిసిపి రాజేష్, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, వివిధ శాఖల ఏసిపిలు, జీహెచ్‌ఎంసీ,విద్యుత్, జలమండలి,ఇరిగేషన్ శాఖల ఉన్నతాధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు

# మార్కెట్ యార్డ్ మూడవ సర్వసభ్య సమావేశం

**యూరియా పై, ప్రజలు ఆందోళన చెందవద్దు చైర్మన్ వెంగళరావు**

**ఆగష్టు 21 (ప్రజా వాయిస్) చేగుంట**
చేగుంట మండల కేంద్రంలోని గల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగళరావు అధ్యక్షతన మూడవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ చేగుంట మార్కెట్ యార్డ్ లోని ఆవరణలోని మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం లక్ష్యం ఓపెన్ కల్లాల వద్ద షెడ్డు నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయడం, మిషన్ల షెడ్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులపై తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. అలానే మార్కెట్‌లో యూరియా కొరత, బ్లాక్ మార్కెట్ సమాచారంపై అధికారులతో మాట్లాడామని తెలిపారు, రైతులు ఆందోళన చెందకుండా యాప్‌లో బుకింగ్‌కు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధుల సహాయం తీసుకోవాలని, అక్రమ నిల్వలపై నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, మార్కెట్ కమిటీ సెక్రటరీ పి. జాన్ వెస్లీ, డైరెక్టర్లు లక్ష్మి, కాశబోయిన శ్రీనివాస్, ఎండి మొజమిల్, సిరిగోజి నర్సింలు, అన్నం ఆంజనేయులు, రఫీక్, రమేష్, లక్ష్మణ్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బాబాపూర్ ఆరోగ్య కేంద్రంలో అదనపు వైద్యుల నియామకం

**ఎమ్మెల్యే హరీష్ బాబు**



**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బాలాజీ అనుకోడా రైతు వేదికలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్క డాక్టర్ మాత్రమే ఉన్నారని, అదనంగా డాక్టర్లను నియమించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మండలంలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సూచించారు.గూడెం వద్ద 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, గుడ్లబోరి గ్రామంలో నిర్మాణం కొనసాగుతోందని వివరించారు. ఈ రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే లో వోల్టేజ్, బ్రేక్‌డౌన్ సమస్యలు తీరతాయని తెలిపారు. బాబాసాగర్–గూడెం మధ్య హామ్ ఫేజ్–1లో బీటీ రోడ్డు మంజూరైందని పేర్కొన్నారు. సర్పంచులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ ప్రకాష్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నా కోసం పనిచేసిన కార్యకర్తలను మరవను

**మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ భరోసా**



**ప్రజా వాయిస్ ఖానాపూర్**
రెండు పర్యాయాలు తన కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ హామీ ఇచ్చారు. ఖానాపూర్ ప్రజలు కష్టాల్లో ఉంటే తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.దస్తురాబాద్ మండలం మున్యాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు విలాస్ యాదవ్ ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని రేఖా శ్యాంనాయక్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి ఇబ్బంది వచ్చినా సహాయం అందిస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొంటూ, "నా కోసం పనిచేసిన ఏ కార్యకర్తను నేను ఎప్పటికీ మరవను. కష్టకాలంలో వారికి అండగా నిలబడటం నా బాధ్యత" అని రేఖా శ్యాంనాయక్ తెలిపారు.

# మాధురి రాథోడ్‌కు న్యాయం చేయాలి

**ప్రజావాయిస్/తుర్కపల్లి**
ఫోక్ సింగర్ ఈశ్వర్ సాయి, ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్‌పై అత్యాచారానికి పాల్పడి, ఆమె పరువుకు భంగం కలిగించేలా వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేశారని వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆలేరు నియోజకవర్గ అధ్యక్షుడు, గుజ్జవానికుంట తండా సర్పంచ్ గుగులోత్ ధూప్ సింగ్ నాయక్ కోరారు.ఈ మేరకు శుక్రవారం తుర్కపల్లి ఎస్ఐ శివకృష్ణకు వినతిపత్రం అందజేశారు.



బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. బాధితురాలికి రూ.5 కోట్ల నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలల బంద్



**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగష్టు 21**
నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లిలోని ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు గురైన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ట్రస్మా పిలుపు మేరకు హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు బంద్‌లో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ఇందిరా చౌక్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తూ రూపారెడ్డి హత్యను ఖండించారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొని రూపారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**SC, ST బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి డిమాండ్**

**నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు**



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**
గిరిజన విద్యార్థి సంఘం, ఎల్‌హెచ్‌పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్షకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారి భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా కల్పించాలని అన్నారు. విద్యార్థి సంఘాలు చేపడుతున్న న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని నల్లమోతు భాస్కర్ రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు, ఎల్‌హెచ్‌పీఎస్ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు...

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : పట్టణంలోని శాస్త్రినగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఖాళీలు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమ అసలు ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను అర్హత నిబంధనల మేరకు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# నేరాల కట్టడికి పటిష్ట నిఘా

**సరిహద్దుల్లో అక్రమ రవాణాకు చెక్.. కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి**

**పోలీసు సేవలు మరింత సమర్థంగా అందించాలి: ఎస్పీ నరసింహ**





**ప్రజా వాయిస్,కోదాడ:**
నేరాల నియంత్రణతోపాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోదాడ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కార్యాలయాన్ని పరిశీలించిన ఎస్పీ.. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కోదాడ రూరల్, అనంతగిరి, చిలుకూరు, చింతలపాలెం, మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసులు, రౌడీ, సస్పెక్ట్ షీట్లను పరిశీలించారు. కేసులు, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల మధ్య గొడవలు, మాదకద్రవ్యాల వినియోగం నివారణకు 'పోలీసు ప్రజా భరోసా' కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు పటిష్టం చేయాలని ఎస్పీ ఆదేశించారు.

## మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ నూతన కమిటీకి దరఖాస్తుల స్వీకరణ

**అంతయిపల్లిలో ఉత్సాహంగా కొనసాగిన ప్రక్రియ**

**భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**



**మేడ్చల్, శామీర్ పేట / ప్రజా వాయిస్:**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన జిల్లా ఓబీసీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం అంతయిపల్లిలోని ఎస్. ఎన్. ఆర్. గార్డెన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీ వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కేతూరి వెంకటేష్, ఓబీసీ అబ్జర్వర్ డాక్టర్ నాగులూరి అరుణ్ కుమార్ గౌడ్, అలోక్ నాథ్, శామీర్ పేట్ రాజేష్, భాస్కర్ తదితరులు దరఖాస్తు ఫారాలను స్వీకరించారు. జిల్లా ఓబీసీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు ద్వారా బీసీ, ఓబీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మరింత ప్రాధాన్యత కల్పిస్తూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు సామాజిక న్యాయం, బీసీ వర్గాల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీపీటీ రాజు, శామీర్ పేట్ 300 డివిజన్ అధ్యక్షులు నక్క సందీప్ గౌడ్, కర్రే రాజేష్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, చాప రాజు, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీతుంకి రమేష్, సురేందర్ ముదిరాజ్, తుంగతుర్తి రవి, మేడ్చల్ మాజీ జడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ మాజీ అధ్యక్షులు గువ్వా రవి ముదిరాజ్, ఏఎంసి డైరెక్టర్ శివ శంకర్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల గోడలు కూలాలి..సమానత్వ జెండా ఎగరాలి!

- **గ్రామస్థాయి నుంచే ఉద్యమానికి పునాదులు.. యువత చేతుల్లో కొత్త నాయకత్వం**
- **అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్య పోరాటం**
- **సెప్టెంబర్ 9న వరంగల్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి: ఉపేందర్ మాదిగ**



**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):**కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా మౌనం వీడి ఉద్యమించాలి.. హక్కుల కోసం గళమెత్తాలి అని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచే ఉద్యమాన్ని బలోపేతం చేసి అణగారిన వర్గాల హక్కుల కోసం బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ముఖ్య నాయకుల సమావేశం మాజీ మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్ మాదిగ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ కుల వివక్ష, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడి సమసమాజ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై ఉద్యమాలు నిర్మించాలని, ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా చదువుకున్న యువతను ఉద్యమంలోకి తీసుకువచ్చి కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5లోపు గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి, సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే ఎంఎస్పీ,ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభకు భారీగా తరలిరావాలని ఉపేందర్ మాదిగ కోరారు. ఈ మహాసభను విజయవంతం చేసి ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబూ మాదిగ, మాజీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసారం శంకర్‌రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**విద్యార్థులతో ముచ్చటించి.. ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ**



**కౌడిపల్లి. ప్రజా వాయిస్**
కౌడిపల్లి మండలంలోని పనికిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను టీఆర్‌పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం సందర్శించారు. నర్సాపూర్--మెదక్ పర్యటనలో భాగంగా గురుకులానికి వచ్చిన ఆయన పాఠశాల, కళాశాలలోని విద్యా వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి అక్కడ జరుగుతున్న బోధన తీరును పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, విద్యా ప్రగతి, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు సంబంధించిన పలు విషయాలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకులంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడిన తీన్మార్ మల్లన్న వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులు, మౌలిక వసతులకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు గురుకుల విద్యాసంస్థలు ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్య, క్రమశిక్షణతో కూడిన వాతావరణం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తీన్మార్ మల్లన్న అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.



## తాగునీటి పథకాన్ని పరిశీలించిన డిఈ

**మరమ్మత్తుల కోసం 80 లక్షలు అవసరం**

**మిషన్ భగీరథ అధికారి శివరాజు**








**ప్రజా వాయిస్.. వనపర్తి**
వీపనగండ్ల మండల కేంద్రంలోని కొల్లాపూర్ తాగునీటి పథకాన్ని మిషన్ భగీరథ డి ఈ శివరాజ్ జై నరేష్ లో పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం తాగునీటి పథకంలో మరమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు ఫిల్టర్ బెడ్స్ శుద్ధి చేసే పరికరాలు, మోటార్ల మరమ్మతులు వంటి వాటికోసం దాదాపు 80 లక్షలు అవసరం ఉంటుందని అంచనాలు వేసినట్లు తెలిపారు సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు మరమతులు పూర్తి అయితే సురక్షితమైన శుద్ధ జలాలను అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని వృధా చేయవద్దని తెలిపారు

## గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** పట్టణంలోని శాస్త్రినగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఖాళీలు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమ అసలు ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను అర్హత నిబంధనల మేరకు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.




## 22వ వార్డు అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం

**ప్రజావాయిస్, ఇల్లందు(ఆగస్టు21):** ఇల్లందు పురపాలక పరిధిలోగల 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో స్థానిక సూపర్ బజార్ ఏరియా అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, వారికి దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల జీవితంలో విద్యాభ్యాసానికి తొలిఅడుగు అంగన్వాడి కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని చిన్న వయసులోనే విద్యపట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ప్రతిచిన్నారికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అజ్మీర సక్కుబాయి, ఆశా వర్కర్ చెడుపాక కరుణ, స్థానిక కాంగ్రెస్ నాయకురాలు కొల్లపురి ఝాన్సీ, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇల్లులే టార్గెట్



**ప్రజా వాయిస్ బిజినపల్లి ఆగస్టు 21**
బిజినపల్లి మండలంలో పగటి వేళ ఇంట్లో చోరీ ఘటన చోటుచేసుకుంది.ముచ్చర్ల గ్రామానికి చెందిన సయ్యద్ రజియా బేగం (55) ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి కనక శివకుమార్ (23) అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు.నిందితుడు బాధితురాలి ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించినట్లు పోలీసులు తెలిపారు.గతంలో బాధితురాలి కుటుంబ సభ్యులతో పరిచయం ఉన్న నిందితుడు, ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం వేసిన ఇంటిని గుర్తించి చోరీకి పాల్పడినట్లు వెల్లడించారు.ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.చోరీ చేసిన ఆభరణాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.నిందితుడి నుంచి చోరీకి సంబంధించిన సొత్తును రికవరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై బిజినపల్లి పోలీస్ స్టేషన్‌లో Cr.No. 211/2026గా కేసు నమోదు చేసి నిందితుడిపై బి.ఎం.ఎస్ సెక్షన్లు 331(4), 305 కింద కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రమాదాల నివారణకు హెచ్చరిక



### కోదాడలో 22 అవగాహన బోర్డులు
### వాహనదారులను అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**ప్రజా వాయిస్,కోదాడ:**
రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా కోదాడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలోని జాతీయ రహదారి--65పై ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాహనదారులను అప్రమత్తం చేసేందుకు 22 ప్రత్యేక అవగాహన, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులను హెచ్చరించేలా బోర్డుల్లో సందేశాలను పొందుపరిచారు. నిబంధనలు పాటించకపోతే జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, కుటుంబాలపై పడే ప్రభావాన్ని వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.జాతీయ రహదారిపై నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తత అత్యవసరమని పోలీసులు తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు వాహనదారులకు ముందస్తు హెచ్చరికలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించడంతోపాటు రహదారి పరిస్థితులను గమనిస్తూ ప్రయాణించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఎస్ఐ అంజిరెడ్డి స్పష్టం చేశారు. మద్యం సేవించి డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచి బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించడం, ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.

## సాగు అయ్యేది ఎట్లా..? కన్నీరు పెడుతున్న రైతన్న..!




**-కేసముద్రం మండలంలో వరుణుడు ముఖం చాటేశాడు..**
**-ఎండిన చెరువులు.. ఎండుతున్న పంటలు..**
**-కాలువ ద్వారా చెరువులు నింపాలని రైతుల వేడుకోలు**

**కేసముద్రం ప్రజావాయిస్:** కేసముద్రం మండల వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గత నెల రోజులుగా సరైన వర్షపాతం లేకపోవడంతో రైతన్న ఆందోళనలో పడ్డాడు. ఆకాశం వైపు చూస్తూ ఒక్క భారీ వర్షం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా చెరువులన్నీ మూగబోయాయి. ఎక్కడా నీళ్లు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బావులు, బోర్లలో నీళ్లు రాక వరి నాట్లు వేసిన రైతులు నీళ్లు లేక పంట ఎండిపోతుందని కంటతడి పెడుతున్నారు. "ఎకరాకు ఇరవై వేలు పెట్టుబడి పెట్టినం.. విత్తనం వేసినం కానీ వర్షం లేదు.. సాగు అయ్యేది ఎట్లా..?" అని పొద్దుటి నుంచి సాయంత్రం దాకా పల్లెల్లో ఇదే మాట ముచ్చట్లు వినిపిస్తున్నాయి. నీళ్లు లేక పనులు లేక కూలీలు కూడా ఇబ్బంది పడుతున్నారు. వర్షపాతం తక్కువ ఉండటం వల్ల రానున్న రోజుల్లో రైతులకు అప్పుల భారం తప్పదని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కౌలు రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే పంట చేతికి రాక అప్పుల పాలవుతామని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువ ద్వారా మండలంలోని పెద్ద చెరువులు, కుంటలను నింపాలని రైతులు కోరుతున్నారు. కాలువ నీళ్లు వస్తేనే మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతున్నా, రైతుల్లో మాత్రం ఆందోళన తగ్గడం లేదు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే కేసముద్రం మండలంలో వ్యవసాయ సంక్షోభం తప్పదని గ్రామస్తులు అంటున్నారు.

## కోదాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు కీలక బాధ్యతలు

### ఫ్లోర్ లీడర్‌గా కందుల కోటేశ్వరరావు.. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా షేక్.ఇమామ్-ఎ-షఫీ




**ప్రజా వాయిస్, కోదాడ:**
కోదాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కందుల కోటేశ్వరరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా షేక్.ఇమామ్-ఎ-షఫీ ను ఎంపిక చేశారు. పార్టీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై విశ్వాసం ఉంచి తమకు ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు కందుల కోటేశ్వరరావు, షేక్.ఇమామ్-ఎ-షఫీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.మున్సిపాలిటీలో ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని, వార్డుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కౌన్సిల్‌లో పార్టీ తరఫున బలమైన గళం వినిపిస్తామని తెలిపారు. పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల మార్గదర్శకత్వంలో కోదాడ మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత చురుగ్గా పనిచేస్తామని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని వారు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తమపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా పనిచేసి.. మున్సిపల్ పాలనలో ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వరరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇమామ్-ఎ-పాషా షేక్ తెలిపారు.

## పూలాజీ బాబా 101వ జయంతి ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

### భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు
### ఎమ్మెల్యే కోవా లక్ష్మి
### డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లో నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా 101వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అధికారులను ఆదేశించారు.ఈ నెల 30న జరగనున్న జయంతి ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవా లక్ష్మి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఐటీడీఏ ఏపీఓ (జనరల్) ఆత్రం భాస్కర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని కోవా లక్ష్మి సూచించారు.తాగునీరు, భోజన వసతి, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, పార్కింగ్, విద్యుత్, భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జాదవ్ అంబాజీ సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

## పెద్దపల్లి డీపీఆర్వోగా తిరుమల బాధ్యతలు స్వీకరణ


**ప్రజా వాయిస్, పెద్దపల్లి :**
పెద్దపల్లి జిల్లా జిల్లా పౌర సంబంధాల అధికారిణి (డీపీఆర్వో)గా బి.తిరుమలను ప్రత్యేక కమిషనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి శ్రీ హర్ష ని మర్యాద పూర్వకంగా కలసి బి. తిరుమల శుక్రవారం పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులతో సమావేశమై శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, మీడియా సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# దంపతుల హత్య.. ఖాకీపై వేటు

**-మోతే దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ షరీఫ్‌పై ఎస్పీ నరసింహ కఠిన చర్యలు**
**-24 గంటల్లోనే నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు**
**- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదు.. డీఎస్పీకి దర్యాప్తు బాధ్యత**
**- త్వరిత విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు పంపేలా చర్యలు**
**- బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరిహారం త్వరగా అందేలా చర్యలు**

**ప్రజా వాయిస్,మోతే:**
సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహమ్మద్ షరీఫ్‌పై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంది. షరీఫ్‌ను పోలీస్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తూ జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చట్టాన్ని రక్షించాల్సిన బాధ్యతలో ఉండి దారుణ హత్యకు పాల్పడటం తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.మోతే మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో పాతిపెట్టిన దంపతుల మృతదేహాల ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో నిందితులను కేవలం 24 గంటల్లోనే గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మోతే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడంతో అతడిపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. డీఎస్పీని దర్యాప్తు అధికారిగా నియమించామని, కేసు త్వరగా విచారణకు వచ్చేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నేరస్థులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా దర్యాప్తును పకడ్బందీగా కొనసాగిస్తున్నామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం త్వరగా అందేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



**చట్టం ముందు అందరూ సమానమే**
శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నేరాలకు పాల్పడినా సొంత శాఖకు చెందిన వారిని సైతం ఉపేక్షించేది లేదని జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది. చట్టాన్ని ఉల్లంఘించిన పోలీసు సిబ్బందిపైనా కఠిన చర్యలు తప్పవని ఈ డిస్మిస్ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి.